# విక్రమార్కుని విడ్డూరం

రచన :
రాచమల్లు రామచంద్రారెడ్డి

విద్యోదయ పబ్లికేషన్స్
కడప

అన్ని హక్కులు: ప్రకాశకులవి

మొదటి ముద్రణ : జూన్, 1960
రెండవ ముద్రణ : నవంబర్, 1971
మూడవ ముద్రణ : జనవరి, 1978

వెల : 2-25

★

ముద్రణ :
క్రాంతి ప్రెస్
12-ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్
మద్రాసు-1.

పూర్వం విక్రమార్కుడనే రాజు వుండేవాడు. ఆ రాజు యిప్పుడు చచ్చి స్వర్గలోకంలో వున్నాడు. స్వర్గలోకంలో వుండే సుఖాలన్నీ అనుభవిస్తూ యెన్నో సంవత్సరాలు, శతాబ్దాలు, అక్కడే గడిపిన తర్వాత, ఆయనకు విసుగు పుట్టింది. ''ఛీ, యెన్నాళ్ళున్నా యిక్కడ ఒకటే సుఖం. యింత సుఖమైతే మనిషికి యేం బాగుంటుంది? మళ్ళీ భూలోకానికి పోతే బాగుండు'' అనుకున్నాడు ఆయన.

పూర్వం భూలోకంలో ఆయన చాలా యేండ్లు రాజ్యం చేసినాడు. రాజ్యం చేయడమే గాక యెన్నెన్నో సాహస కార్యాలు చేసినాడు. రాజులను జయించినాడు, రాక్షసులను చంపినాడు, వీరులను పారద్రోలినాడు, చోరులను చిందర వందరగా చేసినాడు-అబ్బో! ఆయన చేయని ఘనకార్యమే లేదు. ఆ నాడు ఆయన పేరంటే భూలోకమంతా హడలయ్యేది. ఆయన్ను చూస్తూనే అందమైన ఆడవాళ్ళందరూ అట్టే ప్రేమించి పెండ్లి చేసుకునే వాళ్ళు. అందుకనే మంచి మంచి రాజకన్యలందరినీ ఆయనే పెండ్లి చేసుకొని చాలా దర్జాగా, వైభవంగా, రాజ్యం చేస్తూ వీరాధివీర విక్రమార్క మహారాజు అనిపించుకున్నాడు. ఆ దర్జా, ఆ వైభవమూ, అన్నీ జ్ఞాపకం వచ్చి, ఆయనకు భూలోకం చూడాలనే కోర్కె బలంగా కలిగింది.

వెంటనే విక్రమార్కుడు దేవేంద్రుని వద్దకు పోయి ''అయ్యా నేనొకసారి భూలోకం వెళ్ళొస్తాను'' అన్నాడు.

విక్రమార్కుడంటే దేవేంద్రునికి చాలా గౌరవం. అంతటి వీరాధివీరుడు తన లోకంలో వుండడమే చాలు అనుకునేవాడు. ఆయనకు కావలసిన సుఖాలన్నీ దేవేంద్రుడు శ్రద్ధగా యేర్పాటు చేయించేవాడు. అందుకని భూలోకానికి పోవాలని విక్రమార్కుడు అడిగేటప్పటికి దేవేంద్రునికి చాలా ఆశ్చర్యం కలిగి ''యెందుకోయ్, నీ కిక్కడ సుఖంగా లేదా?'' అని అడిగినాడు.

''చాలా సుఖంగా వుంది'' అన్నాడు విక్రమార్కుడు.

''మరి భూలోకానికి పోవడం యెందుకు?'' అన్నాడు దేవేంద్రుడు.

''యిక్కడ చాలా సుఖంగా వుంది దేవరాజా! అందుకే నాకు భూలోకానికి పోవాలని బుద్ధి పుట్టింది'' అన్నాడు విక్రమార్కుడు.

పాపం. దేవేంద్రునికి అర్థం కాలేదు. అర్థం కాక ''చాలా సుఖంగా వుంటే యిక్కడే వుండు. నీకేమైనా కష్టంగా వుంటే చెప్పు, నేను తీరుస్తానుగా'' అన్నాడు.

విక్రమార్కుడు విసుక్కుంటూ అన్నాడు: ''నాకేమీ కష్టం లేదయ్యా! యిక్కడ అంతా సుఖంగానే వుంది. యింత సుఖమైతే మనిషికి యేం బాగుంటుంది?''

అప్పుడు అర్థమైంది దేవేంద్రునికి. ఎంతైనా యితను మనిషేకదా, అందుకని 'స్వర్గ సుఖాలమీద విసుగు పుట్టి వుంటుంది లే' అనుకున్నాడు దేవేంద్రుడు. కానీ యిప్పుడు భూలోకానికి పోతే యితను చాలా కష్టపడతాడే అని జాలి కలిగి, ''నీవు పోతే పోదువుగానీ, నేనొక మాట చెప్తాను, విను'' అన్నాడు. ''నీవు భూలోకం నుండి వచ్చి యిప్పటికి సుమారు

రెండువేల యేండ్లు అయింది. ఈ రెండువేల యేండ్ల లోనూ భూలోకం యెంతగా మారిపోయిం దనుకున్నావో! నీ వసలు గుర్తే పట్టలేవు.''

విక్రమార్కు-నికి దేవేంద్రుని మీదకూడా విసుగుపుట్టి, ''బలే చెప్పినావు లేవయ్యా! నేను భూలోకంలో పుట్టి పెరిగిన వాణ్ని. ఆ లోకం సంగతి నాకు తెలియక నీకు తెలుసునా?'' అన్నాడు.

దేవేంద్రుడు యింకా జాలిపడి, ''అక్కడ పోతే నీవు చాలా కష్టపడతావు'' అన్నాడు.

విక్రమార్కు-నికి కోపం వచ్చి, గర్వంగా అన్నాడు: ''నేనంటే యెవరనుకున్నావ్? నేను వీరాధివీర విక్రమార్క-మహారాజును. నా ధైర్యమూ, నా శౌర్యమూ, నా సాహసమూ, నా పరాక్రమమూ, నీకు తెలిసినట్లే లేదే! నేను భయపడతా ననుకున్నావేమో-కష్టాలంటే నాకు మంచి నీళ్ళ ప్రాయం. అసలు నేను ఆ లోకానికి పోవాలనే దెందు కను కున్నావ్? కష్టాల కోసమే. మీ లోకంలో అన్నీ సుఖాలే, వెధవ సుఖాలు.''

అతని మాటల తీరు చూచి దేవేంద్రుడు మౌనంగా వుండిపోయినాడు. దేవేంద్రుని మౌనం చూచి విక్రమార్కుడు కోపంగా అడిగినాడు: ''ఇంతకూ నన్ను భూలోకానికి పంపిస్తావా, లేదా? యేదో ఒక మాట త్వరగా చెప్పు.''

దేవేంద్రుడు నవ్వుతూ జవాబు చెప్పినాడు: ''అంత తొందర రెందుకోయ్? పంపిస్తాన్లే. రేపు తెల్లవారే టప్పటికి భూలోకం మీద వుంటావ్. నీకు కావలసినవన్నీ చూసుకొని ప్రయాణానికి సిద్ధంగా వుండు. సరేనా?''

''సరే, దేవేంద్రా!'' అంటూ విక్రమార్కుడు పో బోయినాడు.

''ఆగు విక్రమార్కా!'' అని దేవేంద్రుడు అన్నాడు: ''పోవాలని తొందరపడుతున్నావేగాని, తిరిగి స్వర్గలోకానికి రావడం యెట్లనో నీవు ఆలోచించనే లేదు. నేనే చెప్తాను విను. యీ లోకానికి నీవు తిరిగి రావాలనుకున్నప్పుడు, స్వర్గం స్వర్గం స్వర్గం అని మూడుసార్లు అన్నావంటే, వెంటనే యీ లోకంలో చేరుస్తాను. మరచి పోవద్దు. యిక పో.''

## 2

క్రీస్తుశకం 1959 వ సంవత్సరంలో ఒక రోజు తెల్లవారే టప్పటికి విక్రమార్కుడు గుర్రంమీద యెక్కి ఒక రోడ్డు మీద ప్రయాణం చేస్తూ వుండినాడు. పూర్వం తాను భూలోకంలో రాజ్యం చేసేటప్పుడు యెట్లా బట్టలు వేసుకునే వాడో అట్లా బట్టలే వేసుకున్నాడు. తలమీద కిరీటం పెట్టు కున్నాడు. మెడలో ముత్యాలహారాలు వేసుకున్నాడు. నడు ముకు ఒక ఖడ్గం తగిలించుకున్నాడు. ఈ విధంగా పూర్వ కాలపు రాజువేషంలో పోతూ పోతూ రోడ్డువైపు నిదానంగా చూసి, ''అరే, యిట్లాదారి మా కాలంలో లేదే!'' అని ఆశ్చర్యపడినాడు. ''మా కాలంలో వర్షం వస్తే దారి అంతా బురద బురద అయ్యేది. యిదేదో చాలా గట్టిగా వుంది. రాళ్ళూ మన్నూ వేసి గట్టిగా దట్టించినట్లు వుంది. యెంత వర్షం వచ్చినా గుర్రాలే కాదు, రథాలు కూడా సులభంగా ప్రయాణం చేయవచ్చు'' అనుకుంటూ ఆయన ఆ రోడ్డు మీద పోతూ వుండినాడు.

కొంతదూరం పోయేటప్పటికి యెదురుగా వచ్చే ఒక బస్సు కనపడింది. అది యేమైందీ అర్థం కాక ఆయన గుర్రం నిలబెట్టి దానివైపే చూస్తూ వుండినాడు. ఒకటి రెండు నిమిషాలలో బర్ రర్ అని శబ్దం చేసుకుంటూ బస్సు యింకా దగ్గరికి వచ్చింది. ఆ శబ్దమూ దాని ఆకారమూ చూసి ఆయన మొదట యేనుగ ఘీంకారం చేస్తూ వుంది అనుకున్నాడు. అంతలోనే ఆ బస్సు మరికొంత దగ్గరకు వచ్చింది. "యిది యేనుగ మాదిరీ లేదే! యేనుగైతే యింత వేగంగా పరుగెత్తలేదే!" అనుకున్నాడు ఆయన. అంతలో బస్సు డ్రైవర్ యెలెక్ట్రిక్ హారన్ వాయించినాడు. బస్సు యింకా దగ్గరికి వచ్చింది. ఆ శబ్దమూ, వేగమూ, ఆ ఆకారమూ, అన్నీ చూసి విక్రమార్కుడు "యిదేదో భయంకరమైన క్రూర జంతువు మాదిరి వుంది. నా మీదికి వస్తుందేమో? ఐనా, నాకేం భయం? నేను వీరాధివీర విక్రమార్క మహారాజును" అనుకుంటూ ఖడ్గం తీసి చేతిలో పట్టుకొని, తన గుర్రాన్ని రోడ్డుమీద ఒక ప్రక్కన నిలబెట్టినాడు. "ఒక్క వేటుతో దీని తల బ్రద్దలౌతుంది. అరె! దీనికి తల యెక్కడుంది? తలా తోకా లేని జంతువే!" అని ఆయన అనుకుంటూ వుండగానే, క్షణంలో ఆ బస్సు ఆయనకు బారెడు దూరంలో బుఁయ్ మంటూ వెళ్ళిపోయింది. విక్రమార్కునికి ముఖమంతా దుమ్ము నిండుకుంది. దుమ్ము తుడుచుకుంటూ వెనక్కు తిరిగి చూచి, "యీ జంతువుకు తలా తోకా లేకపోవడమే గాదు, కాళ్ళు గూడా లేవే! పాము పోయినట్లే సర్రున పోతూ వుంది. మా కాలంలో లేని వింత వింత జంతువులన్నీ యెక్కడనుండి వచ్చినాయో!" అని ఆయన

ఆశ్చర్య పడినాడు. ''ఈ జంతువు నా మీదికి వస్తుందను కున్నాను. నా ఖడ్గం చూసి భయపడి పారిపోయింది. లేక దగ్గిరికి వచ్చేటప్పటికి నేను విక్రమార్కున్న నే సంగతి అర్థ మయిందేమో! అందుకే బారెడు దూరాన పారిపోయింది'' అనుకుంటూ ఆయన మళ్ళీ ప్రయాణం సాగించినాడు. ఎందు కైనా మంచిదని ఖడ్గం ఒరలో పెట్టకుండా చేతిలోనే పట్టుకొని పోతూ వుండినాడు.

ఇంతలో ప్రొద్దు పొడిచింది. విక్రమార్కుడు నాలుగు దిక్కులూ కలయజూసి, ''భూలోకం యేమీ మారలేదే! ఆ జంతువూ, యీ దారీ, కొత్తగా వున్నాయి కానీ, తక్కిన వన్నీ మామూలుగానే వున్నాయి. చెట్లూ, గడ్డీ, దూరాన కొండలూ, ఆకాశంలో మేఘాలూ. అన్నీ మా కాలంలో వున్నట్లే వున్నాయి.'' అనుకుంటూ పోతూ వుండగా, రోడ్డు ప్రక్కన యిరవై గజాల దూరంలో ఒక పిల్లవాడు మేకలు మేపుకుంటూ కనిపించినాడు. ''ఈ పిల్లవాడు మామూలుగానే వున్నాడు. ఈ మేకలు గూడా మా కాలంలో వున్నట్లే వున్నాయి. ఈ పిల్లవానితో మాట్లాడితే భూలోకం సంగతులు కొన్నైనా తెలుస్తాయి'' అనుకొని, ఆయన ఆ పిల్లవాని దగ్గ రకు పోయినాడు. గుర్రంమీద కూర్చొని వచ్చే విక్రమార్కుని చూసి ఆ పిల్లవానికి ఆశ్చర్యం కలిగింది. వింతగా వున్న బట్టలూ, ధగధగ మెరిసే కిరీటమూ, మెడలో ముత్యాల హారాలూ, యివన్నీ చూసి, ''యెవడో వేషం వేసుకొని వస్తున్నాడు'' అని ఆ పిల్లవాడు అనుకున్నాడు,

గుర్రం దిగకుండానే విక్రమార్కుడు ''అబ్బాయ్, నీదే వూరు?'' అని గంభీరంగా అడిగినాడు.

ఆ వేషమూ, ఆ కీవీ, ఆ గాంభీర్యమూ చూసి పిల్ల వానికి నవ్వు వచ్చింది. నవ్వుతూ వాడు, ''యిదేం వేషం?'' అన్నాడు.

ఆ ప్రశ్న విక్రమార్కు-నికి అర్థం కాక, ''నీదే వూర బ్బాయ్?'' అని మళ్ళీ అడిగినాడు.

''మా వూరు అదుగో, అక్కడుందిలే'' అంటూ పిల్ల వాడు కుడివైపు చేయి చూపించి, ''నీవు నాటకాలు వేసే వానివా, లేక పగటి వేష గానివా?'' అన్నాడు.

పిల్లవాడు చేయి చూపించిన వైపు చూస్తూ వుండిన విక్రమార్కు-డు ఆ ప్రశ్న విని కొంచెంగా కోపం వచ్చి, ''నేనెవరనుకున్నావ్?'' అని చురచుర చూసినాడు.

ఆయన కోపం చూసి పిల్లవానికి నవ్వు ఆగక ''నీది దుర్యోధనుని వేషమా, సారంగధరుని వేషమా? సారంగ ధరుని వైతే చిత్రాంగి లేదే?'' అంటూ పకపక నవ్వినాడు.

వాని నవ్వు చూసి విక్రమార్కు-నికి పిచ్చి కోపం వచ్చి ''నోరుముయ్. నేను వీరాధివీర విక్రమార్క- మహారాజును- జాగ్రత్త!'' అంటూ చేతిలోని కత్తి ఝుళిపించినాడు.

ఆ పిల్లవానికి యింకా పట్టరాని నవ్వు వచ్చింది. రెండు నిముషాలసేపు వికటంగా నవ్వి, తరువాత ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు: ''సరేలే, నాటకం బాగానే ఆడుతున్నావుగానీ, అదుగో - అక్కడ అరమైలు దూరంలో ఇండ్లు కనపడుతున్నాయి చూడు, అదే మా వూరు. అక్కడ పోయి అడుక్కుంటే బిచ్చం పెడతారు. కానీ, నీ వేషం చూస్తే మా వూర్లో కుక్కలు వెంట పడతాయి, జాగ్రత్త!'' ఈ

మాటలు అని వాడు నవ్వు పట్టలేక నేల మీద కూలబడి ''హ్హహ్హహ్హ'' అంటూ పగలబడి నవ్వసాగినాడు.

పాపం విక్రమార్కునికి దిక్కు తెలియలేదు. ''ఎంత బెదరించినా యీ పిల్లవాడు బెదరేటట్లు లేడు. వీనితో శాంతంగానే మాట్లాడడం మంచిది.'' అనుకొని ఆయన గుర్రం దిగి, ఖడ్గం ఒరలో పెట్టి, ఆ పిల్లవాని ప్రక్కనే ఒక రాతి మీద కూర్చొని మెల్లగా అన్నాడు: ''అబ్బాయ్, నేను కొత్త వాణ్ణి. నాకేమీ తెలియదనుకో. నిన్ను ఒకటి రెండు ప్రశ్నలడుగుతాను, చెప్తావా?''

పిల్లవాడు ఆయన వైపు చూసి, ''ఓ, అడుగు చెప్తాను-దానికేం?'' అన్నాడు.

''యిక్కడెక్కడైనా దగ్గరలో యేదైనా పట్నం వుందా?'' అన్నాడు విక్రమార్కుడు.

''పది మైళ్ళలో వుంది అనంతపురం.'' అన్నాడు ఆ పిల్లవాడు.

అనంతపురం అంటూనే, అదొక పెద్ద పట్టణమే అయి వుంటుందని విక్రమార్కుడు సంతోషించి, ''ఐతే అనంతపురానికి రాజెవరు?'' అన్నాడు.

''రాజెవడో, రాతెవడో నాకేం తెలుసు'' అన్నాడు పిల్లవాడు.

ఈ పిల్లవానికి అంత దూరం తెలిసి వుండదులే .అనుకొని. ''అనంతపురం యేవైపుంది?'' అన్నాడు ఆయన.

''అదుగో ఆ రోడ్డు వెంట అల్లే పో, అనంతపురం వస్తుంది.'' అని పిల్లవాడు చెప్పినాడు.

రోడ్డు అనే మాట ఆయనకు కొత్తగా వుంది.

''రోడ్డంటే-ఆ దారినేనా నీవు రోడ్డనేది?'' అన్నాడు.

పిల్లవాడు విసుక్కుంటూ, ''నీ వెక్కడి అడవి మనిషి వయ్యా, రోడ్డంటే తెలియదూ?'' అన్నాడు.

''నాకు తెలియదులే నాయనా, నేను కొత్తవాణ్నని చెప్పలేదూ? మరి, అనంతపురంలో యేమైనా విశేషా లున్నాయా?'' అని ఆయన యింకా శాంతంగా అడిగినాడు.

పిల్లవాడు యింకా విసుక్కుంటూ ''విశేషాలేముం టాయ్? సినిమాలో, సర్కస్‌లో వుంటాయి-పోయి చూడ రాదూ?'' అని తన మేకలు సరిగా వున్నాయో లేదో అని తిరిగి చూసినాడు.

''సినిమాలూ, సర్కస్‌లూ అంటే ఏమిటి నాయనా?'' అంటూ విక్రమార్కుడు కుతూహలంగా అడిగినాడు

పిల్లవాడు లేచి, ''పోవయ్యా, నేనూ నీ మాదిరే అడుక్కుతినే వాణ్ణనుకున్నావా, నీతో పొద్దు పోని మాటలు మాట్లాడుతూ కూర్చోడానికి?'' అంటూ దూరంగా పోయిన మేకలను మళ్ళించుకోడానికి పరుగెత్తుకొంటూ పోయినాడు.

''మొత్తంమీద హుషారైన పిల్లవాడే. కానీ, వీనితో మాట్లాడాలంటే దేవుడు కనబడతాడు'' అనుకుంటూ విక్ర మార్కుడు లేచి అనంతపురం పోవడానికని గుర్రం యెక్కి నాడు. అంతలో రోడ్డుమీద మరొక బస్సు కనపడింది. వేగంగా పోతూ వుండిన ఆ బస్సును చూసి ''ఈ వింత జంతువు సంగతి ఆ పిల్లవాణ్ణి అడిగితే తెలుస్తుంది.'' అనుకొని మెల్లగా పిల్లవాని దగ్గరకు పోయి, ''అబ్బాయీ, యిప్పుడు ఆ దారిన పరుగెత్తుకుంటూ పోయింది యేమిటి?'' అని అడిగినాడు.

పిల్లవాడు ఆయన వైపు వింతగా చూసి ''రోడ్డుమీద పోయిందేనా? అది బస్సుకదూ?'' అన్నాడు.

విక్రమార్కుడికి అర్థం కాక బస్సా? బస్సంటే అదోక జంతువా?'' అన్నాడు.

పిల్లవాడు తీక్షణంగా చూస్తూ ''అది కాదు, నీవే జంతువు. వట్టి అడవి మృగం మాదిరి వున్నావే!'' అన్నాడు.

విక్రమార్కుడికి కోపం వచ్చింది. వీరాధివీర విక్రమార్క మహారాజు అంతటి వాణ్ణి అడవి మృగం అంటే కోపం రాదూ మరి? ఆయనకు పట్టరాని కోపం వచ్చింది. వెంటనే చేయి ఖడ్గం మీదికి పోయింది. అది చూసి పిల్లవాడు నవ్వుతూ ''అబ్బో! పగటి వేషగానికి కోపం కూడా వస్తుందే!'' అన్నాడు హాస్యంగా.

విక్రమార్కుడు కోపం అణచుకొని ''వీనికి నన్ను చూస్తే భయమూ లేదు, భక్తీ లేదు; యెట్లరా భగవంతుడా?'' అనుకుంటూ, మళ్ళీ గుర్రం దిగి మెత్తగా మాట్లాడినాడు. ''నాకు కోపం రాలేదులే నాయనా!బస్సంటే యేమిటో చెప్పవూ? నాకు నిజంగా తెలియక అడుగుతున్నాను.''

పిల్లవాడు ఆశ్చర్యపడి అన్నాడు: ''బస్సంటే తెలియదూ? బస్సులో మనుష్యులు కూర్చొని ప్రయాణం చేస్తారు.''

''అంటే అదోక రథమా? రథమైతే దానికి గుర్రాలు లేవే?'' అన్నాడు విక్రమార్కుడు.

''గుర్రాలూ లేవు, ఎద్దులూ లేవు. ఎద్దులు లేనిబండి అని మా అవ్వ అంటూ వుంటుందిలే.'' అన్నాడు పిల్లవాడు.

''ఎద్దులూ గుర్రాలూ లేకుండా రథ మెట్ల నడుస్తుంది?'' అని అడిగినాడు ఆయన.

''ఐ తే నీవు రైలు కూడా చూడలేదా?''

''రైలంటే యేమిటి?''

పిల్లవానికి చాలా ఆశ్చర్యమైంది. ''రైల్లూ, బస్సులూ చూడని మనిషి యితనేం మనిషి?'' అనుకుంటూ ''నిజంగా చెప్పు, నీ వెవరు?'' అని ప్రశ్నించినాడు.

విక్రమార్కుడు ఠీవిగా జవాబు చెప్పినాడు: ''మొదటనే చెప్పలేదూ, నేను విక్రమార్కుణ్నని?''

పిల్లవానికి మళ్ళీ నవ్వు వచ్చింది. చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: ''భట్టివిక్రమార్కుడంటారే ఆ విక్రమార్కునివా?''

''ఆఁ, ఆఁ, ఆ విక్రమార్కుణ్నే'' అంటూ యింకా ఠీవిగా నీల్గి నిలబడినాడు విక్రమార్కుడు.

ఆ ఠీవి చూచి పిల్లవాడు ''విక్రమార్కుని కంటే వీరభోగ వసంతరాయులు అనే పేరు పెట్టుకోరాదూ. యింకా బాగుంటుందే,'' అంటూ పకపక నవ్వినాడు.

వాని పరిహాసం చూసి ''వీని నవ్వులతో వేగలేక చస్తున్నారా దేవుడా.'' అనుకుంటూ ఆయన శాంతంగానే అన్నాడు: ''అబ్బాయీ, నీకేమో నవ్వులాటగా వుంది కానీ, పూర్వం నుండి నా పేరు విక్రమార్కుడే. పూర్వం అంటే యెన్నేండ్లో తెలుసునా? యిప్పుడు నా వయస్సెంతో చెప్పు చూస్తాను.''

పిల్లవాడు విక్రమార్కుని ముఖంలోకి చూస్తూ ''నీ వయస్సు చెప్పమంటావా? నీకు అరవై నాలుగేండ్లుంటాయి.'' అన్నాడు గంభీరంగా.

వాని గాంభీర్యం చూసి, అరవై నాలుగని అంత నమ్మకంగా చెప్తున్నావే, నీ కెట్ల తెలుసు?'' అన్నాడు విక్రమార్కుడు.

పిల్లవాడు యింకా గంభీరంగా ముఖంపెట్టి, ''విను. మా వూర్లో పుల్లయ్య అనే పిచ్చివాడున్నాడు. పిచ్చి పుల్లయ్యకు ముప్పై రెండేండ్లున్నాయి. నీవు సరిగా పుల్లయ్యంత రెండంతలు పిచ్చివానివి కాబట్టి నీకు సరిగా అరవై నాలుగేండ్లుంటాయి.'' అని పకపక నవ్వుతూ యెగురుతూ దుముకుతూ పరుగెత్తుకుంటూ దూరంగాపోయి ఒక చెట్టు కానుకొని యింకా గట్టిగా నవ్వలేక నవ్వలేక కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వినాడు. విక్రమార్కునికి మొదట కోపం వచ్చింది కానీ, వాని విపరీతమైన నవ్వు చూసి ఆయనకు కూడా నవ్వు వచ్చింది. ''పిల్ల వెధవ! నేను విక్రమార్కున్నని యెంత చెప్పినా యీ పిచ్చివానికి నమ్మకమే లేదు.'' అనుకుంటూ గుర్రం యెక్కి రోడ్డు సమీపించి అనంతపురంవైపు వేగంగా ప్రయాణం సాగించినాడు.

# 3

విక్రమార్కుడు ఆ రోడ్డు వెంటనే పోతూ వుండినాడు. నాలుగైదు మైళ్ళు పోయేటప్పటికి ఒక గుట్ట వచ్చింది. ఆ గుట్టలోని రాళ్ళూ, రప్పలూ, చెట్లూ, పొదలూ, చూసుకుంటూ గుర్రాన్ని మెల్లగా నడిపిస్తూ ఆయన గుట్ట యెక్కినాడు. గుట్ట మీద తుమ్మచెట్లూ, కలీచెట్లూ, గానుగచెట్లూ, యింకా అనేక రకాల చెట్లు చూసి ఆయనకు తన కాలం నాటి అరణ్యాలు జ్ఞాపకం వచ్చినాయి. ''మా కాలంలో మంచి కీకా

రణ్యాలు వుండేవి. ఆ అరణ్యాలలో యేనుగలనూ సింహాలనూ వేటాడుతూ వుంటే చాలా హాయిగా వుండేది'' అనుకున్నాడు ఆయన. ఆ గుట్టంతా తిరిగి యేవైనా జంతువులుంటే వేటాడాలని కూడా ఆయనకు బుద్ధి పుట్టింది. ''వేటాడడానికి విల్లూ, అమ్ములూ తెచ్చుకొని వుంటే బాగుండేది. కనీసం అడవి పందులైనా వుండవా, యీ గుట్ట మీది అడవిలో?'' అని చింతిస్తూ మెల్లగా గుట్ట దిగుతూ వుండగా, దూరాన కేకలూ, యేడుపులూ వినిపించినాయి. వెంటనే ఆ దిక్కు చూసినాడు విక్రమార్కుడు. రెండు ఫర్లాంగుల దూరంలో చెట్లచాటున నలుగురైదుగురు మనుషులు వస్తూ వుండినారు. ''యేమిటది?'' అనుకుంటూ గుర్రాన్ని వేగంగా ఆ వైపు నడిపించినాడు.

ఆ గుట్టలో ఒక కోనలో చెట్ల చాటున వీరయ్యా, అతని భార్య అచ్చమ్మా కలిసి దొంగ సారాయి వండుతూ వుండగా పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు పోలీసు జవాన్లూ, వాళ్ళ మధ్యలో సారాయి కడవ యెత్తుకున్న వీరయ్యా, అతని భార్యా కాలిదారి వెంట వస్తూ వుండడం విక్రమార్కుడు చూసినాడు. అంతలో ''యీ సారికి వదిలిపెట్టండి బాబూ, మీకు పుణ్యముంటుంది సామీ.'' అంటూ యేడుస్తూ వుండిన అచ్చమ్మ కంఠం వినిపించింది. కాకి గుడ్డలూ, తల మీద టోపీలూ, చేతుల్లో తుపాకులూ, వున్న పోలీసు వాళ్ళను చూసి ''వీళ్ళ ఆకారం చూస్తూనే తెలుస్తూ వుంది – దయా దాక్షిణ్యం లేని దుండగులు. బీదవాళ్ళనూ, ఆడవాళ్ళనూ ఏడ్పించే దుర్మార్గులు భూలోకం మీద యింకా వున్నారే! దుర్మార్గులను శిక్షించి, ఆపదలో వున్న వాళ్ళను రక్షించడం

నా ధర్మం.'' అనుకుంటూ విక్రమార్కుడు తీవ్రంగా కోపం తెచ్చుకుని, ఒరలోనుండి కత్తి దూసి, రివ్వున వాళ్ళ కెదురుగా పోయి గుర్రం మీదనుండి దుమికినాడు.

''ఆగండి. వాళ్ళను వదలిపెట్టక పోతే మిమ్ములను ముక్కలు ముక్కలుగా నరుకుతాను.'' అంటూ విక్రమార్కుడు కత్తి ఝళిపిస్తూ గర్జించినాడు.

హఠాత్తుగా యెదురుగా వచ్చి దుమికిన విక్రమార్కుని చూసి వాళ్ళందరూ నివ్వెరపోయినారు. అంతలో అచ్చమ్మ తెప్పరిల్లి ఆయన దగ్గరకు వచ్చి ''రక్షించు తండ్రీ, నీవైనా చెప్పి విడిపించు. నన్నూ నా మగన్నీ పట్టుకున్నారు వీళ్ళు.'' అంటూ పోలీసుల వైపు చూపి దీనంగా యేడ్చింది.

ఆమె యేడ్పు విని ఆయనకు పోలీసుల మీద యింకా కోపం వచ్చింది. ''యెవరు మీరు? వాళ్ళను యెందుకు పట్టుకున్నారు? చెప్పండి.'' అంటూ పండ్లు పట పట కొరికినాడు.

విక్రమార్కుని ఆగ్రహంచూసి పోలీసులుకూడా భయపడినారు. అంతలో ఒకడు ధైర్యం తెచ్చుకొని ''సారాయి వండుతూంటే పట్టుకోక వదలిపెట్టమంటావా?'' అన్నాడు.

''సారాయి వండితే మీకేం? మీరెవరో ముందు చెప్పండి.'' అంటూ విక్రమార్కుడు గద్దించినాడు.

''మేం పోలీసు వాళ్ళం. సారాయి వండే వాళ్ళనూ, త్రాగే వాళ్ళనూ పట్టుక పోవడానికి మాకు ఉత్తరువులున్నాయి.'' అన్నాడు ఆ జవాను.

''ఉత్తరువులా? అంటే మీరు రాజభటులా?'' అన్నాడు విక్రమార్కుడు కొంచెం కోపం తగ్గించుకొని.

పోలీసులకు అప్పటికి భయం తీరింది. ''అదేనయ్యా.

మేం పోలీసు వాళ్ళం అని చెప్ప లేదూ? అంటే రాజభటులమే లే.'' అన్నాడు యింకొక పోలీసు జవాను.

''యెవడోయ్ మీరాజు? మీ రాజుకు బుద్ధి వున్నట్లు లేదే! సారాయి వండుకొని తాగే ప్రజలను శిక్షించమని యే శాస్త్రంలో వుంది? ప్రజలను పీడించడమేనా మీ రాజుకు పని?'' అన్నాడు విక్రమార్కుడు తీవ్రంగా.

పోలీసులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. విక్రమార్కుడే మళ్ళీ అన్నాడు: ''ఇటువంటి వుత్తరువులు యే కాలంలోనూ లేవు, తెలుసునా?''

మొదటి పోలీసు జవాను నవ్వుతూ చెప్పినాడు: ''నిజమే లే. మా మంత్రిగారు కూడా యీ మాటే చెప్తూ వుంటారు.''

''ఏ మాట?''

''ధర్మరాజు రాజ్యంలోనూ, శ్రీరాముని రాజ్యం లోనూ, సారాయి తాగకూడదనే చట్టం లేదనీ, కాబట్టి ధర్మరాజు కంటె, శ్రీరాముని కంటె మేం యెంత గొప్ప వాళ్ళమో చూడండి అనీ మా మంత్రిగారు అప్పుడప్పుడు చెప్తుంటారు. నీవు మా మంత్రిగారి కేమైనా బంధువా?''

ఈ ప్రశ్న విని విక్రమార్కునికి మళ్ళీ కోపం వచ్చింది. ''ఎవడోయ్ మీ మంత్రి? అ స్తవ్య స్తపు రాజుకు అవివేకపు ప్రధాని అన్నట్లు, మీ రాజుకు తగిన మంత్రులే వున్నట్లుందే! మీ రాజుతోనూ మంత్రులతోనూ నేనే స్వయంగా మాట్లాడు తాను – పోదాం రండి.'' అని కోపంగా అన్నాడు ఆయన.

ఇంతవరకూ మాట్లాడకుండా వుండిన మూడవ పోలీసు జవానుకు అనుమానం వచ్చి ''నీవెవరు?'' అన్నాడు.

విక్రమార్కుడనే పేరు చెప్పితే వీళ్లు కూడా నమ్మరనీ ఆ మేకల పిల్లవాని మాదిరే పరిహాసం చేస్తారేమో అనీ, అనుకొని ఆయన తన పేరు చెప్పకుండా ''నేనెవరైతేనేంలే. మీ రాజు దగ్గరకు పోదాం రండి. ముందు వాళ్ళను వదలి పెట్టండి.'' అన్నాడు.

మూడవ జవాను యింకా దగ్గరికి వచ్చి వినయంగా అడిగినాడు: ''నీ కత్తి చాలా బాగుంది. తళతళ మెరుస్తూ వుంది. ఎక్కడ సంపాయించినావు?''

''ఈ ఖడ్గం అంటే యేమనుకున్నావ్! భూత భేతాళ బ్రహ్మ రాక్షసులను జయించిన ఖడ్గం. జాగ్రత్త!'' అన్నాడు విక్రమార్కుడు గంభీరంగా.

''నీ ఖడ్గం చూడ ముచ్చటగా వుంది. ఏదీ! ఒకసారి చూసి యిస్తాను.'' అంటూ ఆ జవాను చేయి చాపినాడు.

''చూడు.'' అంటూ విక్రమార్కుడు తన ఖడ్గం యిచ్చినాడు. జవాను వెంటనే దాన్ని తన బూటుకాలి క్రింద పెట్టి ఫెళక్కున విరిచి ఖడ్గం పిడిని దూరంగా విసిరి పార వేసినాడు.

విక్రమార్కునికి పట్టరాని కోపం వచ్చింది. ''ఓరీ నీచుడా'' అంటూ చేయెత్తి జవానును కొట్టబోయినాడు. అంతలో తక్కిన యిద్దరు పోలీసులూ వెనుకనుండి వచ్చి ఆయన చేతులు పట్టుకున్నారు. మూడవ పోలీసు నడుము కరచుకున్నాడు. ముగ్గురూ కలిసి ఆయనను బలవంతంగా నేల మీద కూర్చోబెట్టి, ''దొంగ వెధవా. యిప్పుడు చెప్పు నీ వెవరవో?'' అని అడిగినారు.

''నీవు కూడా దొంగ సారాయి వండేవానివే కదూ?

లేకపోతే వీరయ్యను విడిపించడానికి యెందుకు వస్తావు?'' అని మూడవ జవాను గద్దించి అడిగినాడు.

''పైగా కత్తులూ ఖడ్గాలూ పట్టుకొని వస్తాడు—దొంగ వెధవ!'' అంటూ మొదటి జవాను గ్రుడ్లురిమినాడు.

''ఆ వేషం చూడు–యెక్కడో నాటకాల వాళ్ళ గుడ్డలన్నీ యెత్తుకవచ్చి నట్లుంది.'' అంటూ రెండవ జవాను పరిహాసం చేసినాడు.

వాళ్ళ బెదరింపులూ, పరిహాసమూ చూసి, ''వీళ్లు వట్టి మూర్ఖులు. బుద్ధిలేని రాజుకు యిటువంటి భటులే దొరుకుతారు.'' అనుకొని, ''యిన్ని మాటలెందుకు? మీరు నిజంగా రాజభటులే ఐతే మీ రాజు దగ్గరకే పోదాం పదండి.'' అన్నాడు విక్రమార్కుడు.

''నీ ముఖానికి రాజు దగ్గరకు పోవాల్నేం? రాజెవడోయ్ - బాలరాజా, వీర్రాజా?'' అంటూ రెండవ జవాను పకపక నవ్వినాడు.

''ఒరేయ్, వీని మాటలు చూస్తే సారాయి త్రాగినట్లుంది, నోరు వాసన చూడు.'' అన్నాడు మూడవ జవాను.

మొదటి జవాను విక్రమార్కుని నోటి దగ్గర తన మూతి పెట్టి ''నోరు తెరు.'' అన్నాడు.

''నోట్లో యేముందిరా మూర్ఖుడా?'' అన్నాడు గట్టిగా విక్రమార్కుడు విసుక్కుంటూ.

''వాసనేమీ రాలేదురా.'' అన్నాడు మొదటి జవాను.

''ఇంతకూ వీణ్ని పోలీస్ స్టేషన్‌కు పిల్చుకపోదామంటారా? మూడు రోజులు లాకప్‌లో పెట్టే బుద్ధి వస్తుంది వెధవకు.'' అన్నాడు రెండవ జవాను.

అంతలో మూడవవాడు గాభరాగా ''అరె. వీళ్లేరిరా? యేరీ, తప్పించుకున్నారే!'' అంటూ లేచి నిలబడి దిక్కులు చూసినాడు.

పోలీసులు ముగ్గురూ విక్రమార్కునితో కుస్తీలు పట్టుతూ వుండగా, వీరయ్యా అచ్చమ్మా సారాయి కడవ క్రిందపెట్టి మెల్లగా తప్పించుకొని పారిపోయినారు. ఆ గుట్టలో చెట్లచాటున యేవైపు పోయినారో కూడా పోలీసులకు అర్థం కాలేదు. ముగ్గురూ దిక్కులు చూస్తూ నిలబడినారు. ఒక నిముషం గడచిన తర్వాత మూడవ పోలీసు ''వాళ్ళు పోతే పోయినారులే. వీణ్ని పట్టుకపోయి కేసు పెడదాం. కడవెడు సారాయి వుంది. మంచి కేసౌతుంది.'' అంటూ విక్రమార్కుని వైపు చూసినాడు. అంతలో విక్రమార్కుడు హఠాత్తుగా లేచి దగ్గరలోనే వున్న తన గుర్రం మీదికి లంఘించి, పది గజాల దూరంలో గుర్రం నిలబెట్టి, ''మూర్ఖులారా, మీరేనా నన్ను పట్టుకునేది?'' అన్నాడు.

మూడవ జవాను ఆయన వైపు చూసి ''వెధవా, మా చేతుల్లో తుపాకులు వున్నాయి. ఒక్క దెబ్బకు చస్తావు.'' అంటూ తన చేతిలోని తుపాకి చూపించినాడు.

తుపాకులంటే విక్రమార్కుని కేం తెలుసు? ఆయన కాలంలో తుపాకు లనేటివి వుంటేనా? అందుకని పోలీసు చూపించిన తుపాకికి భయపడకుండా ''మీ తుపాకులకూ తమలపాకులకూ భయపడడానికి నే నెవరనుకున్నారోయ్? వీరాధివీర విక్రమార్క మహారాజును.'' అన్నాడు ఆయన.

పోలీసు వాళ్ళకు యేమి చేయడానికీ తోచలేదు. గుర్రం మీద వున్న వాణ్ని వెంటబడినా చిక్కడు. తుపాకి

చూపించినా భయపడకుండా వున్నాడు. తుపాకి కాల్చుదా మనుకుంటే, పొరపాటున గుండు తగిలి ఆయనచస్తే వాళ్ళకు మాట వస్తుంది. అందుకని వాళ్ళు ముగ్గురూ మాట్లాడుకొని ''వీనితో యేంలే, ఆ వీరయ్యనే వెతకుదాం.'' అనుకొని, సారాయి కడవ యెత్తుకొని ఆ గుట్టలోనే మరొక దిక్కుకు పోయినారు.

''గతిలేని రాజుకు మతిలేని భటులు! ఈ రాజ్యంలో యింకా యెంత బుద్ధిలేని వాళ్లున్నారో చూస్తానుగా.'' అని అనవ్వుకుంటూ విక్రమార్కుడు పోలీసువాడు పారవేసిన ఖడ్గం పడిని వెదకి మళ్ళీ ఒరలో పెట్టుకొని ప్రయాణం సాగించినాడు. ''యింక యెక్కడా ఆగకూడ'' దనుకుంటూ రోడ్డు యెక్కి అనంతపురం వైపు దౌడు తీసినాడు.

# 4

విక్రమార్కుడు అనంతపురం ప్రవేశించేటప్పటికి ఉదయం తొమ్మిది గంటలయింది. గుర్రాన్ని మెల్లగా నడిపించు కుంటూ, గుర్రం మీదనే కూర్చొని ఆయన తీరుబడిగా మిద్దెలూ, మేడలూ, అంగళ్లూ చూసుకుంటూ ఒక వీధిలో పోతూ వుండినాడు. కార్లూ, బస్సులూ, లారీలూ చాలా కన పడినాయి. వాటిలో మనుషులు కూర్చొని వుండడం చూసి, ''ఆ పిల్లవాడు అన్నట్లు యివి రథాలే. కానీ గుర్రాలు లేకుం డానే నడిచే రథాలు. ఇటువంటి రథాలు మా కాలంలో వుండి వుంటే నేను యింకా యెన్నెన్ని సాహస కార్యాలు చేసి వుందునో!'' అనుకున్నాడు ఆయన. ఎంత ఖరీదు ఐనా సరే, యిటువంటి రథం ఒకటి కొనాలని కూడా తీర్మానించు

కున్నాడు. ''అయినా యిప్పుడెందుకులే, తరువాత చూసుకో వచ్చు.'' అనుకుంటూ పోతూ వుండినాడు. వీధిలో మనుషులు యెంతో మంది అటూ యిటూ తిరుగుతూ వుండినారు. వాళ్ళను చూసి ''యీ పట్టణంలో ప్రజలకు యేమీ పని లేదేమో!'' అని ఆయన ఆశ్చర్యపడినాడు. కొంత దూరం పోయేటప్పటికి వీధిలో పోయేవాళ్ళందరూ తనవైపు చూస్తూ వుండడం గమనించినాడు. అందులో కొందరు తన్ను చూసి నవ్వుతూ వున్నట్లు కూడా ఆయనకు అనుమానం కలిగింది. కాని యెందుకు నవ్వుతూ వుండేదీ అర్థం కాలేదు. ''నవ్వనీలే. ఎంతమంది నవ్వితే నాకేం? నేను వీరాధివీర విక్రమార్క మహారాజును గదా!'' అని తృప్తి పడినాడు. తన బట్టలూ కిరీటమూ చూసి వాళ్ళు నవ్వుతున్నారేమో అని కూడా ఆయనకు అనుమానం వచ్చింది. ''దారి ప్రక్కన మేకలు కాసే పిల్లవాడూ, ఆ రాజభటులూ, నా బట్టలూ కిరీటమూ చూసే నన్ను పరిహాసం చేసినట్లుంది. మూర్ఖులు! నా బట్టలు చూసినా, నా కిరీటము చూసినా, నా మెడలోని హారాలు చూసినా, నేను రాజవంశానికి చెందిన మహారాజునని ఎంత బుద్ధిలేని వాళ్ళకైనా అర్థమౌతుంది. అంత మాత్రం జ్ఞానం కూడా యీ కాలం మనుషులకు వున్నట్లు లేదు. దేవేంద్రు డన్నట్లు భూలోకం చాలా మారిపోయింది. ముఖ్యంగా మనుషుల్లో తెలివి నశించింది'' అనుకుంటూ విక్రమార్కుడు ఠీవిగా పోతూ వుండినాడు.

కొంతదూరం పోయిన తర్వాత కుడివైపు ఆయనకో విశాలమైన వీధి కనపడింది. ఆ వీధిలో ప్రవేశించి అందులోని పెద్ద పెద్ద మేడలూ అందమైన బంగళాలూ చూసి ''యిది

రాజవీధి కావచ్చు.'' అనుకున్నాడు ఆయన. ''యీ అందమైన మేడల్లో మంత్రులూ, సామంతులూ, రాజబంధువులూ వుంటారు.'' అనుకుంటూ పోతూ వుండిన విక్రమార్కునికి ఒక మేడ వరండాలో పదారేండ్ల అందమైన అమ్మాయి ఒకతె కనపడింది.

ఆ మేడ రామదాసు అనే వకీలుది. ఆ అమ్మాయి రామదాసుకుమార్తె కల్యాణి. కల్యాణి మేడమీద వరండాలో నిలబడి, ప్రొద్దు పోక, క్రింద వీధిలో వచ్చే పోయే వాళ్ళను చూస్తూ వుంది. ఆ అమ్మాయిని చూసి విక్రమార్కుడు ''యీ రాజకన్య చాలా అందంగా వుంది.'' అనుకుంటూ, తలయెత్తి ఆమెవైపే చూస్తూ గుర్రాన్ని మెల్లగా నడిపించుకుంటూ పోతూ వుండినాడు.

కళ్యాణి విక్రమార్కుణ్ని చూసింది. ఆ వేషమూ, ఆ కిరీటమూ, నడివీధిలో గుర్రం యెక్కి రావడమూ చూసి కళ్యాణికి నవ్వు వచ్చింది. ''యెవడీ పల్లెటూరు పశువు!'' అనుకుంటూ ఆమె మెల్లగా తనలో తాను నవ్వుకుంది. ఆమె వైపే చూస్తూ వుండిన విక్రమార్కుడు ఆమె నవ్వుకోవడం కూడా చూసి ''యీ రాజకన్య నన్ను చూసి చిరునవ్వు నవ్వింది.'' అనుకున్నాడు. వెంటనే ''యీ రాజకన్య నన్ను ప్రేమించిందేమో?'' అని ఆయనకు అనుమానం వచ్చింది. అనుమానం వచ్చిన మరుక్షణంలోనే ''యీ రాజకన్య నన్ను తప్పక ప్రేమించే వుంటుంది.'' అని ఆయనకు గట్టి నమ్మకం యేర్పడింది. ఆ అమ్మాయి తన్ను ప్రేమించిందనే నమ్మకం కలుగుతూనే విక్రమార్కునికి ఆ అమ్మాయి మీద యెక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చింది.

విక్రమార్కునికి పూర్వమునుండీ అందమైన ఆడపిల్లంటే చాలా మోజు. ఎక్కడైనా అందమైన రాజుబిడ్డ కనిపిస్తే చాలు, ఆయనకు వెంటనే ప్రేమపుట్టేస్తుంది. ఆయన కాలంలో రాజకుమార్తెలు కూడా అంతే – విక్రమార్కుణ్ని చూసీ చూడకముందే ఉట్టిపాటుగా ప్రేమించేవాళ్ళు. ఆ కాలంలో మాదిరే యీ కాలంలో కూడా రాజకన్యలు తన్ను చూసి ప్రేమిస్తారని అనుకున్నాడు ఆయన. పైగా కల్యాణి తన్ను చూసి నవ్వింది. ప్రేమించక పోతే యెందుకు నవ్వుతుంది? నవ్వింది కాబట్టి తప్పక ప్రేమించే వుంటుంది-అనుకున్నాడు.

తన్ను ప్రేమించిందనుకొన్న కల్యాణి మీద విక్రమార్కునికి విపరీతమైన ప్రేమ పుట్టింది—బ్రహ్మాండమైన ప్రేమ పుట్టింది. ఆ ప్రేమలో ఆయన ఉక్కిరిబిక్కిరై తల యెత్తి ఆమెవైపే చూస్తూ వుండినాడు – రెప్ప వాల్చకుండా ఆమెవైపే చూస్తూ వుండినాడు. ఇంతలో ఆ యిల్లు దాటి గుర్రం ముందుకు పోయింది. ఆయన మాత్రం యెత్తిన మెడ దించకుండా ఆమెవైపే చూస్తూ వుండినాడు. గుర్రం ముందుకు పోయే కొద్దీ మెడ యింకా యెత్తినాడు, యింకా యెత్తినాడు. మెడ యెత్తగా యెత్తగా చివరకు కిరీటం జారి క్రింద పడింది. విక్రమార్కుని కిరీటం క్రింద పడడం చూసి కల్యాణి కిలకిల నవ్వింది. ''యీ వెర్రి వెంగళప్పకు ఒళ్ళు స్వాధీనంలో లేదు.'' అనుకొని ఆ అమ్మాయి కిలకిల నవ్వింది.

కిరీటం జారి క్రింద పడిన వెంటనే విక్రమార్కుడు తెప్పరిల్లి గుర్రం నిలిపి దిగినాడు. గుర్రం దిగుతూ వుండగానే ఆయనకు కల్యాణి కిలకిల నవ్వు వినపడింది. కిరీటం తీసుకొని

కుడిచేతిలో పట్టుకొని, ఎడమ చేయి గుర్రం మీద ఆనించి, విక్రమార్కుడు మళ్ళీ తలయెత్తి కల్యాణి వైపు చూసినాడు. ''యీ రాజకన్య నన్ను చాలా గాఢంగా ప్రేమించింది. అందుకే యింత గట్టిగా కిలకిల నవ్వింది.'' అనుకొని ఆయన నడి వీధిలో గుర్రానికి ఆనుకొని ఆమె వైపే చూస్తూ వుండినాడు.

ఈ వింత దృశ్యం చూసి కల్యాణి ఉల్లాసంగా నవ్వుకుంటూ, యీ తమాషా తన తమ్మునికి కూడా చూపించాలని ''గోపీ, గోపీ, యిటు రా.'' అని పిలిచింది. కల్యాణి తమ్ముడు గోపీకి పండ్రెండేండ్లు వుంటాయి. మేడ లోపల గదిలో చదువుకుంటూ వుండిన గోపీ, అక్క పిలుపు విని వరండాలోకి వచ్చినాడు. ''అటు చూడు గోపీ, ఆ మనిషి ఎంత తమాషాగా వున్నాడో!'' అంటూ కల్యాణి అతనికి విక్రమార్కుణ్ని చూపింది. ఆ దృశ్యం చూసి గోపీకి చాలా ఉత్సాహం కలిగింది. ''అక్కా, అక్కా, వాడు సర్కస్ మనిషి కదూ?'' అంటూ అతను ఉత్సాహంగా చప్పట్లు కొట్టినాడు.

''ఉండు గోపీ, వాడు సర్కస్ మనిషో కాదో? ఇంకా యేమేం తమాషా చేస్తాడో చూస్తాం వుండు.'' అని చెప్పింది కల్యాణి.

''సర్కస్ మనిషే అక్కా. చూడు, వాని వేషం చూడు. ఆ గుర్రం కూడా చూడు, బలిసి సర్కస్ తెలుగువిశ్వవిద్యాలయ గుర్రం మాదిరి లేదూ?'' అంటూ గోపీ సంతోషంతో యింకా చప్పట్లు కొట్టినాడు.

''అబ్బ! అల్లరి చెయ్యద్దురా. ఊరక చూస్తూ వుండ లేవూ?'' అంటూ కల్యాణి అతన్ని వూరుకోబెట్టింది.

వాళ్ళ సంభాషణ విక్రమార్కుడికి వినపడకపోయినా, వాళ్లు తన్ను గురించే మాట్లాడుకుంటున్నారని అర్థమయింది. ''పాపం, ఈ రాజకన్యకు నామీద యెంత ప్రేమ పుట్టిందో! తన ప్రేమంతా ఆ పిల్లవానితో చెప్పుకుంటూ వుంది. తాను ప్రేమించిన సంగతి నాకు అర్థం కావడానికే ఆ పిల్లవానితో చెప్తూతూ వుంది. ఔరా, యెంత తెలివి గలది యీ రాజ కన్య!'' అనుకున్నాడు ఆయన. ''మళ్ళీ మేడ దగ్గరగా పోతే తన పేరూ, తండ్రి పేరూ మొదలైనవన్నీ తానే నాకు తెలియ చేస్తుంది. వివరాలన్నీ తెలుసుకుంటే తరువాత వెంటనే పెండ్లి చేసుకోడానికి ప్రయత్నం చెయ్యొచ్చు.'' అని మనసులో అనుకొని విక్రమార్కుడు గుర్రం యెక్కి నుళ్ళీ మేడ వైపు వచ్చినాడు. మేడ కెదురుగా రోడ్డుమీద ఆ వైపునుండీ యీ వైపుకూ, యీ వైపునుండి ఆ వైపుకూ గుర్రాన్ని నడిపిస్తూ కల్యాణివైపే చూస్తూ తిరుగుతూ వుండినాడు. ఆ విధంగా విక్రమార్కుడు రెండు మూడు సార్లు అటూ యిటూ తిరిగే టప్పటికి గోపీ సంతోషం పట్టలేక ''వీడు సర్కస్‌లో బఫూన్ మాదిరీ వున్నాడక్కా. చూడు యెంత తమాషా చేస్తున్నాడో! క్రిందికి పోయి చూసి వస్తాను.'' అంటూ ఉత్సాహంగా గంతులు వేస్తూ పరుగెత్తినాడు. తమ్ముని ఉత్సాహం చూసి కళ్యాణి ''అల్లరి వెధవా!'' అంటూ మెల్లగా నవ్వుకుంది.

ఆ అమ్మాయి తన్ను ప్రేమించిందనే నమ్మకం విక్ర మార్కునిలో యింకా గట్టిపడింది. పిల్లవాని ద్వారా ఆమె

తన కేదో వార్త పంపివుంటుందని అనుకొని ఆ యింటి కెదురుగా గుర్రాన్ని నిలబెట్టి ఆతురతతో యెదురు చూస్తూ వుండినాడు. గోపీ క్రిందికి దిగి వీధిలోకి వచ్చి విక్రమార్కుణ్ని చూసి ''సర్కస్‌వాలా, సర్కస్‌వాలా!'' అంటూ సంతోషంతో చప్పట్లు కొట్టుతూ గంతులు వేసినాడు. ''అబ్బాయ్, యీ యిల్లు యెవరిది?'' అని విక్రమార్కుడు మెల్లగా అడిగినాడు.

గోపీ ''ఈ యిల్లు మాదే!'' అన్నాడు.

పాపం, యీ జవాబు వల్ల విక్రమార్కునికి యేమీ లాభం కలుగలేదు. ఒక క్షణం ఆలోచించి, ''మీ తండ్రి పేరేమి?'' అన్నాడు.

''రామదాసు'' అని గోపీ చెప్పినాడు.

''మేడమీద వున్న అమ్మాయి యెవరు?'' అని అడిగినాడు విక్రమార్కుడు.

''మా అక్క, కల్యాణి.'' అని చెప్పి గోపీ ''నీవు సర్కస్ మనిషివా? సర్కస్ యెప్పుడు వేస్తారు?'' అని అడిగినాడు.

గోపీ ప్రశ్నకు జవాబివ్వకుండా విక్రమార్కుడు మళ్ళీ అడిగినాడు: ''మీ అక్క నాకేమైనా చెప్పి పంపిందా?''

ఇంతలో గోపీ తండ్రి రామదాసు యింట్లో నుండి బయటికి వచ్చి, విక్రమార్కుణ్ని చూసి ''యెవరు గోపీ?'' అని కొడుకు నడిగినాడు.

''సర్కస్ మనిషి నాన్నా.'' అని గోపీ ఉత్సాహంగా బదులు చెప్పినాడు.

సర్కస్ మనిషి ఐతే గుర్రంమీద కూర్చొని వీధుల్లో

యెందుకు తిరుగుతాడు అనుకొని రామదాసు విక్రమార్కుణ్ణే అడిగినాడు: ''యెవరవోయ్ నీవు?''

''నేను వీరాధివీర విక్రమార్క మహారాజును.'' అని విక్రమార్కుడు ఠీవిగా జవాబు చెప్పినాడు.

ఆ జవాబు విని గోపీకి చాలా సంతోషమయింది. ''బఫ్రూన్ నాన్నా, సర్కస్ బఫ్రూన్'' అని గంతులు వేస్తూ ''రాత్రికి సర్కస్‌కు పోదాం నాన్నా''అని తండ్రి నడిగినాడు. గోపీకి సర్కస్ అంటే చాలా యిష్టం. సర్కస్‌లో బఫ్రూన్ చేసే తమాషాలు యెన్నిసార్లు చూచినా అతనికి యింకా చూడాలనే అనిపించేది. విక్రమార్కుణ్ని చూసినప్పటినుండీ అయన్ను సర్కస్‌లో హాస్యగాడనే అతను అనుకున్నాడు.

విక్రమార్కుడు చెప్పిన జవాబు విని రామదాసుకు కోపం వచ్చింది. ''సర్కస్ వెధవ నాతో హాస్యమాడుతాడా!'' అని కోపగించుకొని అతను ''రాస్కెల్, నాతో హాస్యమాడు తున్నావా? నిజం చెప్పు నీ వెవరవో—యెవరు నీవు?'' అని గద్దించి అడిగినాడు.

విక్రమార్కుడు మళ్ళీ గంభీరంగా చెప్పినాడు: ''నిజం చెప్తున్నాను – నా పేరు విక్రమార్కుడు.''

రామదాసుకు పట్టరాని కోపంవచ్చింది. గోపీకిమాత్రం పట్టరాని సంతోషం కలిగింది. ''అది పేరు నాన్నా,సర్కస్‌లో తమాషాకు పెట్టుకున్న పేరు.'' అని గోపీ నవ్వుతూ తండ్రితో చెప్పినాడు. రామదాసు తీవ్రంగా కోపగించుకొని ''దొంగ వెధవా. నీవు విక్రమార్కునివో చక్రమార్కునివో, మా యింటి ముందునుండి ఫో ముందు.'' అని గట్టిగా అరచినాడు.

తండ్రి మాటతో గోపీకి ఇంకా సంతోషమై "చక్రం మార్కు కిరసనాయిల్ డబ్బా కదూ నాన్నా." అంటూ ఇంకా గట్టిగా నవ్వినాడు. ఇంతలో కల్యాణి కూడా యీ తమాషా యేమిటో చూడాలని మేడ దిగి క్రిందికి వచ్చి వాకిట్లో నిలబడింది. ఆమెను చూచి విక్రమార్కుడు "యీ రాజకన్య తండ్రిని కూడా లెక్క చేయకుండా నా కొరకు దిగి వచ్చింది కదా! నా మీద యెంత ప్రేమ వుందో!" అనుకొని ఉబ్బి తబ్బిబ్బులై చేయి ముందుకు చాచి "హా, సుంద రాంగీ!" అన్నాడు.

అప్పుడు రామదాసుకు ఇంకా అలవికాని కోపం వచ్చి "దొంగ ముండాకొడుకా, పో ఇక్కడినుండి. నిన్ను పోలీసు లకు పట్టిస్తాను. చూడు, నిన్ను జైలుకు పంపిస్తాను, నిన్ను గల్లుకు వేయిస్తాను." అంటూ గట్టిగా కేకలు వేసినాడు. ఆ కేకలు విని ఇరుగుపొరుగు వాళ్ళూ, వీధిలో పోయే వాళ్ళూ సుమారు పదిమంది అక్కడ చేరినారు. ఇంట్లోనుండి రామ దాసు నౌకరు కర్ర తీసుకొని వచ్చినాడు. అందరూ కలిసి విక్రమార్కుని పట్టుకోడానికి ప్రయత్నం చేసినారు. వాళ్ళ ప్రయత్నం చూసి విక్రమార్కుడు గంభీరంగా చిరునవ్వు నవ్వుతూ "నీచులారా, మీరేనా నన్ను పట్టుకునేది! నేనెవ రనుకున్నారో, వీరాధివీర విక్రమార్క మహారాజును!" అంటూ ఒరలోనుండి ఖడ్గం లాగినాడు.

పాపం తన ఖడ్గం విరిగిపోయిందనే సంగతి ఆయన మరచిపోయినాడు. ఆ ఖడ్గం చేతిలో పట్టుకొని చేయి యెత్తే టప్పటికి, మూడంగుళాలు మాత్రమే పొడవు వున్న ఆ

మొద్దు కత్తిని చూసి అక్కడవున్న వాళ్ళంతా గొల్లున నవ్వి నారు. గోపీ ఆనందం పట్టలేక కల్యాణి దగ్గరకు పోయి ''సర్కస్ బాగుందక్కా, సర్కస్ బాగుందక్కా, సర్కస్‌లో బఫూన్లకు మొద్దు కత్తులే వుంటాయక్కా.'' అంటూ గంతులు వేస్తూ ఒకటే అల్లరి చేసినాడు. కల్యాణి కూడా విక్రమార్కుని మొద్దుకత్తి హాస్యానికి నవ్వు పట్టలేక తమ్ము నితో కలసి పక పక నవ్వింది.

మొద్దు కత్తిని చూసి అందరూ నవ్వుతూ వుండగా, రామదాసు నౌకరు ''దొంగ గాడిదా, మా మీదికి కత్తి యెత్తుతావా!'' అంటూ చేతిలోని కట్టెతో ఒక వేటు వేసి నాడు. ఆ వేటు తప్పించుకోడానికి విక్రమార్కుడు ఖడ్గం అడ్డు పెట్టినాడు. కానీ, అది మొద్దుకత్తి ఐనందువల్ల, కట్టె నేరుగా వచ్చి ఆయన తలమీద పడింది. ఆ దెబ్బకు విక్రమార్కుని కిరీటం క్రిందపడింది. కిరీటం క్రింద పడడం చూచి అక్కడవున్న వాళ్ళందరూ ఆ తమాషాకు ఇంకా గట్టిగా నవ్వసాగారు. కల్యాణి కూడా నవ్వు పట్టలేక పకపక నవ్వుతూ యింట్లోకి పరుగెత్తింది. ఇక గోపీ సంగతైతే చెప్పనక్కరేలేదు. అతని ఆనందానికి పట్టపగ్గాలు కూడా లేవు. అతను కల్యాణి వెంబడే ఇంట్లోకి పరుగెత్తి మంచం మీద పడుకొని పొర్లి పొర్లి నవ్వసాగినాడు.

కిరీటం క్రిందపడుతూనే విక్రమార్కుడు తన ఖడ్గం వైపు చూసుకున్నాడు. ఆ మొద్దుకత్తిని చూసి చాలా సిగ్గు పడినాడు. కిరీటం క్రిందపడడం ఇంకా అవమానకరంగా వుంది. ఆ అవమానంలో ఆయనకు కోపం కూడా వచ్చింది.

''నా యంతటి వీరాధివీరునకు ఇంతటి పరాభవమా!'' అనుకొని, అక్కడ వున్న వాళ్ళందరినీ భస్మం చేయాలన్నంత కోపం వచ్చింది ఆయనకు. కానీ యేం చేస్తాడు? చేతిలో ఖడ్గంకూడా లేదు. అందుకని ''ఐనా యిప్పుడెందుకులే; వీళ్ళ పని తర్వాత చెప్తాను.'' అనుకొని వెంటనే గుర్రాన్ని అదలించినాడు. చుట్టూ వున్న వాళ్ళనందరినీ లెక్కచేయకుండా గుర్రం దౌడు తీసింది.

దౌడు తీసే గుర్రం మీద విక్రమార్కుడు ఆ వీధిలో అల్లే పోతూ వుండినాడు. కొంతదూరం పోయిన తర్వాత ఆ వీధి పెద్ద బజారులో కలుస్తుంది. అక్కడ రోడ్డు మధ్య ఒక ట్రాఫిక్ పోలీసు నిలబడి వచ్చేపోయే కార్లకూ, బండ్లకూ, సైకిళ్ళకూ తన చేతులతో సైగలు చేస్తూ వుండినాడు. విక్రమార్కుడు సరిగా అక్కడికి పోయేటప్పటికి యీ వైపునుండి పోయే బండ్లన్నిటినీ ఆగమని ఆ పోలీసు చేయెత్తినాడు. విక్రమార్కునికి అది అర్థంకాక అదే వేగంతో ముందుకు పోయినాడు. ఆ వేగం చూసి ఆ పోలీసు ''వీనికి రూల్సు తెలియవేమో-బస్సుల క్రిందపడి చస్తాడే పాపం!'' అనుకొని ''ఆగు, ఆగు,'' అని గట్టిగా కేక వేసినాడు. పోలీసు వాని చూసి రాజభటుడని విక్రమార్కుడు అర్థం చేసుకొన్నాడు. ''నాదగ్గర యిప్పుడు ఖడ్గం కూడా లేదు. రాజభటులకు చిక్కకూడదు'' అనుకొని గుర్రాన్ని యింకా తోలుతూ పెద్ద బజారులో కుడివైపు తిరిగినాడు. తిరిగీ తిరుగక ముందే ఆ వైపు నుండి వచ్చే లారీ ఒకటి గుర్రానికి ఢీ కొట్టింది. గుర్రం కాలు విరిగి క్రిందపడింది. గుర్రమీదనుండి విక్ర

మార్కుడు విసరి వేసినట్లు క్రిందపడినాడు. తలకు గాయం తగిలి తెలివి తప్పింది.

# 5

గాయం చిన్నదే ఐనందువల్ల విక్రమార్కునికి మూడు నిముషాల్లో తెలివి వచ్చింది. తెలివి వచ్చేటప్పటికి ఆయన ఒక కార్లో వెనుక సీటులో పండుకొని వుండినాడు. బజార్లో ఏవో యేవాళ్ళైవరో ఆయనకు తెలివి తప్పడం చూసి ఆస్పత్రిలో చేర్చడానికని కారులో తీసుకపోతూ వుండినారు.

విక్రమార్కునికి తెలివి వచ్చిందే కాని సంపూర్ణంగా రాలేదు. తాను యెక్కడ వున్నదీ, యేమిచేస్తున్నదీ, ఆయనకు ఏమీ అర్థంకాలేదు. కారులో మెత్తని సీటుమీద పండుకొని వున్నందున ఎక్కడో గాలిలో తేలిపోతూ వున్నట్లుంది. "మళ్ళీ దేవలోకానికి పోతున్నానేమో?" అని అనుమానం వచ్చింది. కానీ యింకా తల తిరుగుతూ వుంది లేవడానికీ మాట్లాడడానికీ తగినంతగా తెలివి రాలేదు. అందుకని ఆయన కదలకుండా అల్లే కండ్లు మూసుకొని వుండినాడు.

రెండు మూడు నిముషాల్లో కారు ఆస్పత్రి కాంపౌండులో నిలిచింది, విక్రమార్కుని కింకా సరిగా తెలివిరాలేదు. ఆస్పత్రి నౌకర్లు వచ్చి ఆయనను మొత్తుకొనిపోయి బల్లమీద పండబెట్టినారు. డాక్టర్ గాయం పరీక్షించి మందు వేసి కట్టు కట్టినాడు. కట్టు కట్టేటప్పు డొకసారి విక్రమార్కుడు కండ్లు తెరచినాడు. డాక్టర్లూ, నర్సులూ అందరూ వింతగా కనపడినారు. వాళ్ళందరూ యెవరైనదీ, తాను యెక్కడున్నదీ ఆయనకు అర్థం కాలేదు. అంతా అయోమయంగా వుంది.

తాను యెందుకు పండుకొని వున్నాడో, వాళ్ళంతా యెందుకు తన చుట్టూ వున్నారో, యేమీ అర్థం కాక దిక్కులు దిక్కులు చూసినాడు. డాక్టరు 'కదలకుండా పడుకో' అని చెప్పి, నిద్ర బాగా వచ్చేటందుకని ఒక మాత్ర విక్రమార్కుని నోట్లో వేసి ''మింగు'' అన్నాడు. ఆ మాత్ర మింగి ఆయన మత్తుగా మళ్ళీ కంళ్లు మూసుకున్నాడు.

మధ్యాహ్నం రెండు గంటలకు విక్రమార్కునికి బాగా మెలకువ వచ్చింది. మెలకువ వచ్చి తాను ఒక మంచంమీద పండుకొని వున్నట్లు తెలుసుకున్నాడు. తరువాత అటూ ఇటూ చూసినాడు. ఆ వైపూ యీ వైపూ యింకా పది పన్రెండు మంచాలు, ఆ మంచాలమీద పండుకున్న వాళ్లూ కనపడినారు.

ఆయనకంతా కలలో వున్నట్లుంది. ఏమీ అర్థం కాక ''యీ గదిలో యింత మంది వరుసగా యెందుకు పండుకున్నారు? వీళ్ళ మధ్యలో నేనెందుకున్నాను? వీళ్ళందరూ యెవరు? నే నెవరు?'' అనుకున్నాడు. ''నే నెవరు?'' అన్న సందేహం రాగానే లేచి కూర్చొన్నాడు. కూర్చొని తన బట్టలు చూసుకొని ''నేను విక్రమార్కుణ్నే లె''మ్మని సంతోషించినాడు. తరువాత తన ఖడ్గం చూసుకున్నాడు. ఖడ్గం లేదు. ఖడ్గం పెట్టుకునే ఒర కూడా లేదు. ఏమైనాయి? తరువాత చేయి తల మీాద పెట్టి కిరీటం చూసుకున్నాడు. లేదు–కిరీటం కూడా లేదు. ఏమైంది? తల చుట్టూ యేదో బట్ట వుంది. ఈ బట్ట ఎవరు చుట్టినారు? మెడలో హారాలు చూచుకున్నాడు. హారాలు వున్నాయి. కిరీటమూ, ఖడ్గమూ ఎక్కడ

పోయినాయో! ఆయన మళ్ళీ గది అంతా కలయజూసినాడు. కొంతమంది నిద్రపోతున్నారు. ఆ మూల ఒకడు దగ్గుతున్నాడు. ఈ మూల ఒకడు మూల్గుతున్నాడు. తక్కిన వాళ్ళంతా నిశ్శబ్దంగా పండుకొని వున్నారు. ఏమిటిది? ఇదంతా ఏదో మాయగా వుందే!

మాయ! మాయ అనే మాట వెంట ఆయనకు ''ఇదంతా రాక్షస మాయేమో?'' అన్న అనుమానం వచ్చింది. ''ఇది రాక్షసుల పట్టణమేమో? లేక, పాతాళ లోకమేమో! వీళ్ళనందరినీ రాక్షసులు పట్టుకవచ్చి యిక్కడ నిర్బంధంలో వుంచినారేమో? నేను కూడా రాక్షసులకు చిక్కినానేమో? లేక, మన్నుందరినీ యెవరైనా బ్రహ్మరాక్షసి యెత్తుక వచ్చిందేమో? అందరినీ ఒకనాడు కాళికాదేవికి బలి యిస్తుందేమో? వీరాధివీర విక్రమార్క మహారాజును నన్ను కూడా యెత్తుక వచ్చిందే, యీ బ్రహ్మ రాక్షసి యెంత గొప్పదో! ఐనా, యిటువంటి బ్రహ్మరాక్షసులను నేను ఎంత మందిని చూసినానో! నా సంగతి దీనికి తెలిసినట్లు లేదు.'' ఈ విధంగా విక్రమార్కునికి ఆలోచనలు వచ్చినాయి.

''అయితే, నేను బ్రహ్మరాక్షసికి యెప్పుడు దొరికినాను? నన్ను యెప్పుడు తెచ్చింది?'' అని ఆయనకు సందేహం వచ్చి, తీవ్రంగా ఆలోచించినాడు. మొదట తాను గాలిలో తేలిపోతూ వుండినట్లు, తరువాత యెక్కడో ఆగినట్లు, ఎవరో తన్ను మోసుకపోయినట్లు, తన్ను ఒక బల్లమీద పండబెట్టి తన చుట్టూ యెవరెవరో యేమో చేసినట్లు, అన్నీ ఒక టూకకే కలలో జరిగినట్లు లీలగా జ్ఞాపకం వచ్చినాయి. అవన్నీ

జ్ఞాపకం వచ్చి, తన్ను బ్రహ్మరాక్షసే యెత్తుక వచ్చిందనీ, తానిప్పుడు రాక్షసనగరంలో వున్నాడనీ అనుకున్నాడాయన.

విక్రమార్కుడు లేచి మంచం మీద కూర్చోని వుండడం చూసి ఆ వార్డు నర్సు ఆయన పేరూ, వూరూ, అడ్రసూ. అన్నీ అడిగి వ్రాసుకోడానికి ఆయన దగ్గరికి వచ్చింది. తెల్ల గౌను వేసుకొని, తలకు తెల్ల గుడ్డ చుట్టుకొని, తెల్ల బూడ్సులూ, తెల్ల మేజోళ్లూ వేసుకొని వచ్చే నర్సును చూసి విక్రమార్కుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. అటువంటి దుస్తులు వేసుకొన్న మనిషిని ఆయన యెన్నడూ చూడలేదు. ''ఇదేం వేషం? మా కాలంలో యిటువంటి బట్టలు యెవరూ వేసుకోవడం లేదే!'' అని ఆశ్చర్యపడుతూ నర్సు వైపు చూస్తూ వుండినాడు. మరుక్షణంలో ఆయనకు యింకొక అనుమానం వచ్చింది. ''ఈ మనిషి ఆడమనిషా, మగమనిషా?'' అనుకుంటూ ఆమెను పరిశీలనగా చూసినాడు. ''నడక చూస్తే ఆడవాళ్ళ నడకగానే వుంది. కానీ, గాజులూ, ముఖాన కుంకుమా, యేమీ లేవు. కట్టుకున్న బట్టలు చూస్తే మగవాడూ కాదు, ఆడదీ కాదు. మగవాడూ కాక ఆడదీ కాక యేమవుతుంది?'' అనుకుంటూ వుండగానే యింకా పెద్ద అనుమానం వచ్చింది. ''మగవాడూ కాదు, ఆడదీ కాదు, యిది బ్రహ్మరాక్షసి కావచ్చు.'' అని అనుమానం వచ్చింది. ''బ్రహ్మరాక్షసి మారువేషం వేసుకుందేమో? లేక, కొత్త రకం బ్రహ్మరాక్షసులు బయలుదేరినారేమో యీ కాలంలో? లేక, యిది బ్రహ్మరాక్షసి బిడ్డ, పిల్ల బ్రహ్మరాక్షసేమో? నేను బ్రహ్మరాక్షసులను చాలా చూసినాను

గానీ, బ్రహ్మరాక్షసి పిల్లలను యెప్పుడూ చూడలేదు.''
అని ఆయన అనుకుంటూ వుండగానే నర్సు వచ్చి మంచం దగ్గర నిలబడి ''ఏం? లేచి కూర్చున్నావే'' అని నెమ్మదిగా పలకరించింది.

విక్రమార్కుడు ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా ఆమెను యెగాదిగా చూసి ''నీవు బ్రహ్మరాక్షసివా, బ్రహ్మరాక్షసి బిడ్డవా?'' అన్నాడు.

ఆ ప్రశ్న వింటూనే ఆమెకు ఒళ్ళంతా కోపంతో ఉడికి పోయింది.

ఆ నర్సు పేరు మిస్ ఎలిజబెత్. ఆమెకు మగవాళ్ళంటే కోపం. ఆమె సన్నగా, యెత్తుగా, నల్లగా వుంటుంది. ఆమె అందంగా లేదని చిన్నప్పటినుండీ ఆమెను మగవాళ్ళందరూ యెగతాళి చేసేవాళ్ళు. అందుకని చిన్నప్పటినుండీ ఆమెకు మగవాళ్ళంటే మంట.

''నీవు బ్రహ్మరాక్షసివా, బ్రహ్మరాక్షసి బిడ్డవా?'' అనే ప్రశ్న విని, విక్రమార్కుడు తన్ను యెగతాళి చేస్తున్నాడని ఆమెకు ఒళ్ళంతా కోపంతో ఉడికి పోయింది. అరికాలి నుండి కోపం చుర చుర నెత్తికెక్కింది. కోపం పట్టలేక రాస్కెల్, స్కౌండ్రల్, రోగ్, యిడియట్, గూస్, ఆస్, అని ఐదు నిమిషాలసేపు యింగ్లీషులో తిట్టింది. తరువాత తెలుగులో మొదలు పెట్టి – దొంగ వెధవా, పోకిరీ వెధవా, క్రాడీ వెధవా, సిగ్గులేని వెధవా బుద్ధిలేని వెధవా అని ఐదు నిముషాల సేపు తిట్టింది. గుక్కతిప్పుకోకుండా, ఏకధాటిగా వొచ్చే ఆ తిట్లను చూసి విక్రమార్కుడు ''యిదెక్కడి బ్రహ్మరాక్షసిరా

తండ్రీ!'' అనుకొని మౌనంగా వుండినాడు. ఇంతలో యింకా కొందరు నర్సులూ, ఆస్పత్రి నౌకర్లూ, ఒక డాక్టరూ అక్కడ చేరినారు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ తిట్లన్నీ ఐపోయిన తర్వాత ''నీ బ్రతుక్కు నేను బ్రహ్మారాక్షసిగా వున్నానా? నీ ముఖానికి నేను బ్రహ్మారాక్షసి బిడ్డగా వున్నానా? చెప్పు.'' అంటూ ఎలిజబెత్ ఆయనను ఉద్దాడించి అడిగింది.

ఆమె ప్రశ్నకు సమాధానంగా విక్రమార్కుడు ''నీవు బ్రహ్మారాక్షసివి కాదు.'' అన్నాడు.

ఎలిజబెత్తుకు అప్పుడు తొంభై వంతులు కోపం తగ్గి పోయి శాంతించింది.

''బ్రహ్మారాక్షసి అయితే మనుషులను తింటుందేగాని తిట్టదు.'' అన్నాడు విక్రమార్కుడు.

ఆ మాట విని అక్కడ చేరిన వాళ్ళందరూ ఫక్కున నవ్వినారు. ఎలిజబెత్తుకు మళ్ళీ కోపంతో రక్తం ఉడికి, మళ్ళీ తిట్ల వర్షం ప్రారంభించింది. విక్రమార్కుడు తన కాలంలో యెంతో భయంకరమైన బ్రహ్మారాక్షసులతో యుద్ధం చేసి జయించినాడు. అవన్నీ మనుషులను తినే బ్రహ్మారాక్షసులే. ఈకాలంలో మనుషులను తిట్టే బ్రహ్మారాక్షసుల జాతి ఒకటి కొత్తగా పుట్టిందేమో అనుకొన్నాడు. ఈ కొత్త జాతి బ్రహ్మారాక్షసులతో యుద్ధం చేసే దెట్లనో ఆయనకు తోచ లేదు.

నవ్వుతూ వుండిన వాళ్ళనందరినీ బయటికి పంపించి డాక్టరు విక్రమార్కుని దగ్గరికి వచ్చినాడు. ఆ డాక్టరు కండ్లకు అద్దాలు పెట్టుకొని, చేతిలో స్టెతస్కోపు పట్టుకొని

వుండినాడు. అవి యేమైంది విక్రమార్కునికి అర్థం కాలేదు. ఆ చేతిలో వున్నది కొత్త రకం ఆయుధమేమో! డాక్టర్ దుస్తులు కూడా విక్రమార్కునికి వింతగానే కనపడినాయి. అంతా కొత్తగా వుంది. కొత్త రకం ఆయుధాలు ధరించిన కొత్తరకం బ్రహ్మరాక్షసులను యేవిధంగా జయించవలసిందీ ఆయనకు అర్థం కాలేదు. ఐనా, ఆయన జీవితంలో ఎప్పుడూ భయం అనేది యెరుగని వాడు కాబట్టి ధైర్యంగా మంచం మీద కూర్చొని వుండినాడు.

డాక్టరు విక్రమార్కుని దగ్గరికే వచ్చి చిరునవ్వు నవ్వుతూ అడిగినాడు: ''ఎవరవోయ్ నీవు? నీకు మనుషులతో మాటాడేది రాదా?''

విక్రమార్కుడు డాక్టర్ వైపూ నర్సువైపూ మళ్ళీ ఒక్కసారి చూసి ''నాకు మనుషులతో మాట్లాడేదీ వచ్చు; బ్రహ్మరాక్షసులతో యుద్ధం చేసేదీ వచ్చు. కానీ, మీరు మనుషులేనా?'' అన్నాడు.

డాక్టరు నవ్వుతూ ''మేం మనుషులమే. బాగా చూడు. మేం యిద్దరం మనుషులమే. నేను మగవాణ్ని; యీమె ఆడ మనిషి.'' అన్నాడు.

విక్రమార్కునికి డాక్టర్ మాటలమీద కొంచెం నమ్మకం కలిగింది. కానీ ఆమె ఆడమనిషి అనేది యింకా అనుమానంగానే వుంది. ''ఈమె ఆడమనిషా?'' అంటూ ఆమె వైపు చూసి ''ఊఁహూఁ-యీమె ఆడ మనిషి కాదే?'' అన్నాడు.

ఆ మాట వినేటప్పటికి ఎలిజబెత్తుకు యేడుపు వచ్చింది.

ఆమె అందంగా లేదని చిన్నప్పటినుంచీ యెంతమంది మగవాళ్లు అపహాస్యం చేసినా ఆమెకు కోపం మాత్రమే వచ్చేది. కోపంతో ఆమె మగవాళ్ల నందరినీ అసహ్యించుకునేది. ఇంత వరకూ ఆమెను అందరూ అందంగా లేదని అన్నారే కాని– ఆడమనిషి కాదని యెవరూ అనలేదు. ఈనాడు ఆమెను ఆడమనిషి కాదనేటప్పటికి, పాపం ఆమెకు పట్టరాని దుఃఖం వచ్చింది. దుఃఖంతో యేడుస్తూ కన్నీళ్ళు తుడుచుకుంటూ ''చూడండి డాక్టర్! వీడు ఎంతమాట అంటున్నాడో చూడండి డాక్టర్! నేను ఆడమనిషిని కాదా డాక్టర్? మీరైనా చెప్పండి డాక్టర్!'' అంటూ డాక్టర్ వైపు చూసి దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి యేడ్చింది.

ఆమె దుఃఖంచూసి డాక్టర్‌కు జాలి కలిగింది. ''ఊరుకో ఎలిజబెత్! వానికి బుద్ధిలేక అన్నాడులే. నీకే మైందీ–నీవు చక్కని ఆడమనిషివి. చాలామంచి ఆడమనిషివి. నూటికి నూరుపాళ్ళూ ఆడ మనిషివి. ఏ మాత్రం కల్తీలేని ఆడమనిషివి. కన్నీళ్లు తుడుచుకో. వాడేదో అన్నాడని అంతగా యేడుస్తావా? నా మాట నమ్ము ఎలిజబెత్. నీవు నిజంగా ఆడమనిషివి. బంగారుబొమ్మ వంటి ఆడమనిషివి. అసలైన ఆడమనిషివి. భూలోకంలో నిన్ను మించిన ఆడమనిషే లేదు.'' అంటూ డాక్టర్ ఆమెను బుజ్జగించి యేడుపు మాన్పించినాడు.

తాను ఆడమనిషే అని డాక్టర్ అంత నమ్మకంగా చెప్పడంతో ఎలిజబెత్తుకు దుఃఖం తీరి, మళ్ళీ మామూలుమనిషి అయింది. కన్నీళ్లు తుడుచుకొని విక్రమార్కుని వైపు చూసి కోపంతో, ''పశువు, మృగం, గాడిద, కుక్క, నక్క, ఖడ్గ

మృగం, గొరిల్లా, చింపాంజీ,'' అంటూ తనకు తెలిసిన జంతువు లన్నిటినీ ఆయనకు నడ్డించి, యింకా కోపం తీరక అవతలి వైపుకు తిరిగి నిలబడింది.

ఎలిజబెత్తు నోరు మూత పడిందాకా వుండి, తర్వాత డాక్టరు విక్రమార్కుని వైపు చూసి నవ్వుతూ ''చూడవోయ్, ఆడమనిషి కాకపోతే అంతగా యేడుస్తుందా!'' అన్నాడు.

అప్పుడు విక్రమార్కునికి ఆమె ఆడమనిషే అని నమ్మకం కలిగింది. ''నిజమే ఆడమనిషి కాకపోతే అంతగా యెందుకు యేడుస్తుంది? పూర్వకాలంలో కూడా ఆడవాళ్లు యిట్లే యేడ్చేవాళ్లు. కానీ యింకా గట్టిగా, కేకలు వేస్తూ వూరందరికీ వినపడేటట్లు, మిద్దె కప్పు యెగిరిపోయేటట్లు యేడ్చేవాళ్లు. ఇప్పుడీమె సుందరంగా, సుకుమారంగా, ఎంతో నాజూకుగా యేడ్చింది. ఈమె ఏడుస్తూ వుంటే హాయిగా సంగీతం మాదిరి వుంది. ఈమె ఏడుపు వింటూవుంటే యింకా వినాలనిపిస్తుంది—ఇంకా ఏడిపించా లనిపిస్తుంది.'' అనుకున్నాడు విక్రమార్కుడు. ఇంకా ఏడిపించా లనుకున్నాడే కాని, ఆమె తిట్లకు భయపడి ఆయన వూరకుండినాడు. పూర్వం యుద్ధాలలో ఆయనకు ఎన్నెన్నో ఆయుధాలు తగిలినాయి కానీ ఆయన ఏ ఆయుధానికీ భయపడి ఎరుగడు. ఇప్పుడు ఎలిజబెత్తు తిట్లంటే ఆయనకు భయం కలిగింది.

తరువాత డాక్టర్‌తో ఆయన అన్నాడు: ''మీరు మనుషులైతే వేషాలు యిట్లున్నాయేం?''

డాక్టరు సమాధానం చెప్పినాడు: ''ఆమె నర్సు,

నేను డాక్టర్ను. ఆస్పత్రిలో వున్నప్పుడు మేము ఇట్లా బట్టలే వేసుకుంటాం. ఇది ఆస్పత్రి అని తెలియదూ?''

''ఆస్పత్రి అంటే ఏమిటి? మీరు నర్సూ, డాక్టరూనా? అంటే భార్యాభర్తలా?'' అని విక్రమార్కుడు అమాయకంగా అడిగినాడు.

ఆయన అమాయకత్వం చూసి డాక్టరుకు నవ్వు వచ్చింది. నవ్వుతోపాటు ''ఆస్పత్రి అంటే కూడా తెలియని మనిషి ఇతనెవరు?'' అని అనుమానం వచ్చింది. ఎలిజబెత్తుకు మాత్రం విక్రమార్కుని మాటలు విని సంతోషమైంది. తాను డాక్టర్ను పెండ్లి చేసుకుంటే ఎంత బాగుంటుంది అని ఊహించుకుంటూ సంతోషంతో ముసిముసి నవ్వులు నవ్వు కుంటూ విక్రమార్కుని మీద కోపమంతా మరచిపోయి ''ఇతనెవరో మంచివాడే పాపం. అన్యాయంగా తిట్టి పోసి నాను.'' అనుకుంటూ వుండింది.

డాక్టరు నవ్వుతూ విక్రమార్కునితో చెప్పినాడు: ''ఆస్పత్రి అంటే రోగులకు మందులు ఇచ్చే స్థలం. ఇక్కడ పండుకున్న వాళ్లందరూ రోగులే. నేను రోగులను పరీక్షచేసి ఏమి చికిత్స చేయవలసిందీ చెప్తాను. నర్సు రోగులకు నేను చెప్పిన మందులు ఇచ్చి వాళ్లకు కావలసిన తిండీ తీర్థమూ మొదలైనవన్నీ చూసుకుంటుంది.''

విక్రమార్కుడు క్రమంగా అంతా అర్థం చేసుకొని ''నీవు వైద్యుని వన్నమాట. అయితే యిది రోగులు వుండే స్థలమా? మరి నాకేం రోగం వచ్చింది?'' అని ఆదుర్దాగా అడిగినాడు.

డాక్టర్ ఆయన ఆదుర్దా చూసి నవ్వుకుంటూ "నీ కేమీ రోగం లేదులే. తలకు గాయం తగిలింది. రోడ్డుమీద క్రిందపడినావు-జ్ఞాపకం లేదూ?" అడిగినాడు.

విక్రమార్కు-నికి నిదానంగా జ్ఞాపకం వచ్చింది. ఔను, తాను గుర్రంమీద వేగంగా స్వారీచేస్తూ వుండినాడు. ఒక చోట రాజభటుడు 'ఆగు, ఆగు' అని కేక వేసినాడు. అంత లోనే తానూ తన గుర్రమూ క్రిందపడినారు. తరువాత-తరు వాత ఏమైంది? తరువాత ఏమైందీ విక్రమార్కు-నికి జ్ఞాపకం రాలేదు. తన తలకు చుట్టిన గుడ్డ గాయానికి కట్టినకట్టేమో? తన్ను ఇక్కడికి ఎవరు తెచ్చినారు? తాను ఎక్కడో గాలిలో తేలిపోయినట్లూ, తన్ను ఎవరో మోసుక పోయినట్లూ తాను బల్లమీద పండుకొని వుండగా, తన చుట్టూ, ఎవ, రెవరో నిలబడి వుండినట్లూ తాను ఏదో మాత్ర మ్రింగి నట్లూ, తాను కల కన్నానని అనుకున్నవన్నీ మళ్ళీ జ్ఞాపకం తెచ్చుకొని, అవన్నీ కలలో జరిగినవి కావనీ, నిజంగా జరిగినవే అనీ, తనకు గాయం తగిలినప్పుడు తన్ను ఎవరో ఆస్పత్రికి చేరవేసినారనీ, విక్రమార్కు-డు అర్థంచేసు కున్నాడు.

విక్రమార్కు-డు ఇవన్నీ జ్ఞాపకం చేసుకుంటూ వుండగా ఆయనకొక పెన్సిలిన్ ఇంజెక్షన్ ఇవ్వమని డాక్టర్ నర్సుతో చెప్పినాడు. నర్సుపోయి రెండు నిమిషాల్లో మందు నింపిన ఇంజెక్షన్ సిరంజి (పిచికారీ)తో తిరిగి వచ్చింది. డాక్టరు సిరంజి తీసుకొని "నీ చేతికి సూదిమందు వేస్తాం-చేయిపట్టు" అన్నాడు విక్రమార్కు-నితో. సిరంజికి వున్న సూదిని చూసి

విక్రమార్కుడు "అదేమిటి? ఆ సూదితో పొడుస్తావా?" అన్నాడు.

డాక్టరు ఆయన వైపు వింతగా చూస్తూ "యే ఫ్యూగోయ్ నీది? సూదిమందు అంటే తెలియదూ? ఇంజెక్షన్ అనే మాట వినలేదూ? యీ సూదితో నీ చేతికి మందు యెక్కిస్తే గాయానికి చీము పట్టకుండా వుంటుంది; గాయం త్వరగా మానుతుంది." అన్నాడు.

విక్రమార్కునికి అర్థంకాక "యిదేం వైద్యం? తిలకు గాయం తగిలితే చేతికి మందు వేస్తారా?నీవు నిజంగా వైద్యుని వేనా? నిజం చెప్పు. లేక, యిదంతా రాక్షసమాయా?" అన్నాడు తీవ్రంగా.

యింతవరకూ నవ్వుతూ మాట్లాడుతూ వుండిన డాక్టర్‌కు విక్రమార్కుని ప్రవర్తనతో విసుగు వచ్చింది. కానీ, వీడెవడో అమాయకుడు లెమ్మని శాంతంగా చెప్పినాడు: "సూదితో చేతికి మందు యెక్కిస్తే,మందు వెంటనే రక్తంలో కలిసి దేహమంతా వ్యాపిస్తుంది. కాబట్టి, వెంటనే గాయం మీద పనిచేస్తుంది. కడుపులోకి యిచ్చే మందుకంటె సూది మందు చాలా త్వరగా పనిచేస్తుంది–తెలుసునా?"

సూదులతో మందులు వేస్తారంటే విక్రమార్కునికి నమ్మకం కలుగక అనుమానంతో డాక్టర్ వైపు చూసినాడు. డాక్టర్‌కు విసుగు వచ్చి, "నీ వెవరో వట్టి అడవి మనిషి మాదిరి వున్నావు. యీ మందు వేయించుకుంటే గాయం త్వరగా మానుతుంది. నీవు రేపే యిక్కడి నుండి పోవచ్చు. లేకపోతే రెండు వారాలైనా యిక్కడే వుండవలసి వస్తుంది. నీ యిష్టం." అన్నాడు.

రెండు వారాలు అక్కడే వుండడ మంటే విక్రమార్కు-నికి భయమైంది. ఎలిజబెత్తు భయంకరమైన తిట్లను రెండు వారాలు భరించడం కంటె, యేమైనాకానీ సూది మందు వేయించుకోవడమే మేలు అనుకొని ''సరే, వేయండి.'' అన్నాడు.

డాక్టరు విక్రమార్కునికి ఇంజెక్షన్ వేసి''యిక నేను పోతున్నాను. నీ పేరూ, వూరూ, అన్నీ నర్సుతో చెప్పు, వ్రాసుకుంటుంది నీవు మర్యాదగా మాట్లాడకపోతే మాత్రం, ఆమె నోరు యెటువంటిదైందీ తెలుసుగదా!'' అని చెప్పి వెళ్ళిపోయాడు.

డాక్టర్ పోతూనే నర్సు కాగితమూ, పేనా, తీసుకొని ''నేనడిగినవన్నీ చెప్తావా? వ్రాసుకుంటాను.'' అన్నది.

విక్రమార్కుడు ''తాటాకు లేవీ?'' అన్నాడు.

''తాటాకు లెందుకు?''

''వ్రాసుకోడానికి.''

నర్సుకు కోపం వచ్చి ''మళ్ళీ మొదలు పెట్టినావా నీ పిచ్చి చేష్టలన్నీ?'' అంటూ గట్టిగా అడిగింది.

విక్రమార్కుడు ఆమె కోపానికి భయబడి ''అంత కోప మెందుకు తల్లీ? తాటాకులూ గంటమూ లేకుండా యెట్లు వ్రాసుకుంటావు?'' అన్నాడు.

''యిదుగో,యీ కాగితంమీద యీ పేనాతో వ్రాసుకుంటాను – చూడు'' అని నర్సు కాగితమూ, పేనా చూపించింది.

విక్రమార్కుడు వాటిని చేతిలోకి తీసుకొని చూసి, పేనాతో కాగితంమీద గీతలు గీసి''వీటితో చాలా సులభంగా

వ్రాయవచ్చు. ఈ కాలం మనుషులు అన్నీ కొత్త కొత్తవి కనిపెట్టినారు. చాలా తెలివిపరులుగా వున్నారే!'' అనుకున్నాడు.

నర్సు వాటిని మళ్ళీ తీసుకొని ''యిక చెప్పు వ్రాసుకుంటాను. నీ పేరేమి?'' అని అడిగింది.

''విక్రమార్కుడు.''

''మంచి పేరు పెట్టుకున్నావే!'' అంటూ నర్సు వ్రాసుకుంది. తరువాత ''నీ వయస్సెంత?'' అని అడిగింది.

''రెండువేలా చిల్లర.'' అన్నాడు విక్రమార్కుడు.

ఆ జవాబు విని ఆయన తనతో హాస్యమాడుతున్నాడని నర్సు అనుకుంది. ఆమెతో మగవాళ్ళెవ్వరూ యెప్పుడూ హాస్యమాడలేదు. ఆమె అందంగా లేదని చాలా మంది ఆమెతో మాట్లాడేవాళ్ళు కాదు. యిప్పుడు విక్రమార్కుడు తనతో హాస్యమాడుతున్నాడనుకొని ఆమెకు సంతోషమయింది. సంతోషంతో చిరునవ్వు నవ్వుతూ ఆమె ''నీవు చాలా మంచివానివి. నిన్ను యిందాకా అనవసరంగా అనరాని మాటలన్నీ అన్నాను. నన్ను క్షమించవూ?'' అని అడిగింది.

ఆమె మెత్తని మాటలకు విక్రమార్కుడు జాలిపడి ''నేనే నిన్ను అన్యాయంగా బ్రహ్మరాక్షసి అన్నాను. నీవే నన్ను క్షమించు.'' అన్నాడు.

నర్సుకు యింకా సంతోషమై ''యిద్దరమూ క్షమించుకుందాంలే.'' అని ''యిక హాస్యం కట్టిపెట్టి నీ వయస్సెంతో చెప్పు.'' అన్నది.

''యిప్పుడు చెప్పలేదూ – రెండువేలా చిల్లర.'' అన్నాడు విక్రమార్కుడు.

''మళ్ళీ హాస్యమేనా? సరిగా చెప్పు. నలభై యేండ్లు వుంటాయా?'' అన్నది నర్సు.

''నీతో బుద్ధివున్నవా డెవడూ హాస్య మాడడు, నాకు నిజంగా రెండువేల యేండ్లకు పైగా వున్నాయి.'' అన్నాడు విక్రమార్కుడు.

నర్సుకు చిరాకూ కోపమూ వచ్చినాయి. ''యీ మొండి వెధవతో అన్నీ చిక్కులే. ఐనా నా కెందుకులే. చెప్పి నట్లు వ్రాసుకుంటాను. డాక్టరు వచ్చినప్పుడు రిపోర్టు చేస్తాను'' అనుకొని ''వయస్సు రెండువేలా చిల్లర.'' అని వ్రాసుకుంది. తిరువాత ''నీ తండ్రి పేరేమి?'' అని అడిగింది.

''తండ్రి పేరు మరచిపోయినాను.'' అన్నాడు విక్రమార్కుడు.

ఆమెకు మళ్ళీ కోపం వచ్చింది. అంతలోనే ''వీనికి పిచ్చిపట్టిందేమో?'' అని అనుమానం వచ్చి విక్రమారుని ముఖంలోకి సూటిగా చూస్తూ ''నిజంగా తండ్రి పేరు జ్ఞాపకం లేదా?'' అని అడిగింది.

విక్రమార్కుడు విసుక్కుంటూ ''రెండువేల ఏండ్లు దాటితే యెవరికైనా తండ్రి పేరు జ్ఞాపకం వుంటుందా?'' అన్నాడు.

నర్సుకు యేమి చేయడానికీ దిక్కు తెలియక తిరువాతి ప్రశ్న అడిగింది; ''నీ దేవ్వూరు?''

''చావక ముందు ఉజ్జయిని, చచ్చిం తర్వాత స్వర్గ లోకం.'' అన్నాడు విక్రమార్కుడు.

ఆ జవాబు విని నర్సుకు మళ్ళీ తీవ్రమైన కోపం వచ్చింది. ''యిది ఆస్పత్రి అనుకున్నావా, అత్తగారిల్లు అను

కున్నావా? ప్రశ్నలకు జవాబులు చెప్పలేవూ?'' అంటూ గద్దించి అడిగింది. ఆమె మాటలు విని విక్రమార్కునికికూడా కోపం వచ్చింది. కానీ ఆమెకు యింకా కోపం తెప్పిస్తే మళ్ళీ ఏమేమి తిట్లు తిడుతుందో అని భయపడి మౌనంగా వుండినాడు.

''లేక నీనికి నిజంగా పిచ్చి పట్టిందేమో?'' అని నర్సుకు మళ్ళీ అనుమానం వచ్చి ''నీకు పిచ్చి పట్టిందా?'' అని కోపంతోనే అడిగింది.

విక్రమార్కుడు మౌనంగా వుండలేక ''నాకు పిచ్చి పట్టలేదు. నీవే పట్టినావు, దయ్యం పట్టినట్లు.'' అని తటాలున మంచంమీద పండుకొని అవతలి వైపుకు ముఖం తిప్పు కున్నాడు.

దయ్యం అనేటప్పటికి నర్సుకు ఆకాశ మెత్తున ఆగ్రహం వచ్చింది. కోపంతో రక్తమంతా వేడెక్కి ఒళ్ళంతా వణకి పోయింది. ఆగ్రహం అణచుకోలేక ధుమధుమలాడుతూ ''నీవే దయ్యం, మీ నాన్న దయ్యం, మీ అమ్మ దయ్యం, మీ తాత దయ్యం. మీ మామ దయ్యం, మీ మేనత్త దయ్యం''అంటూ నోరు నొచ్చిందాకా విక్రమార్కునీ, విక్ర మార్కుని బంధువులనూ, అందరినీ వరుసబెట్టి తిట్టింది. ఆ తిట్లు భరించలేక విక్రమార్కుడు నిండా ముసుగుపెట్టి పండు కున్నాడు. ఐదు నిముషాల్లో ఆయన బంధువుల కందరికీ సమా నంగా సంతర్పణ జరిగింది. తిట్టవలసిన వాళ్ళందరూ ఐపోయి నారు. కానీ ఆమెకు యింకా కోపం తగ్గలేదు. ''వీనిమీద డాక్టరుకు రిపోర్టు చేస్తాను. మధ్యన నాకెందుకు?'' అను కుంటూ పోయి జరిగిన విషయమంతా డాక్టరుతో చెప్పింది.

విక్రమార్కుడు ముసుగు పెట్టుకొని "నా యంతటి వీరాధివీరుడు ఈ నాటికి భయపడి ముసుగు పెట్టుకోవలసి వచ్చె కదా!" అని అవమానంతో బాధపడుతూ, యింకా గట్టిగ ముసుగుపెట్టుకున్నాడు. యింతలో డాక్టర్ వచ్చి ముసుగు తీసి "నర్సును మళ్ళీ దయ్యం అన్నావట – నీకు బొత్తిగా జ్ఞానం లేదా?" అన్నాడు.

విక్రమార్కుడు డాక్టర్ వైపూ, నర్సువైపూ చూసి ఏమి మాట్లాడడానికీ భయపడి గట్టిగా కండ్లు మూసుకున్నాడు.

డాక్టరు నర్సువైపు చూసినాడు. "వీనికి పిచ్చి పట్టినట్లుంది డాక్టర్. ప్రశ్నలడిగితే అన్నీ పిచ్చికూతలే కూస్తున్నాడు." అంటూ నర్సు తన ప్రశ్నలూ విక్రమార్కుడు చెప్పిన జవాబులూ అన్నీ వివరంగా డాక్టరునకు చెప్పింది.

ఆమె చెప్పిందంతా విని డాక్టరు "వీని ప్రవర్తన చూస్తే పిచ్చి పట్టినట్లే వుంది. క్రిందపడి తలకు గాయం తగిలినప్పుడు మెదడు చెడిపోయి వుండవచ్చు" అన్నాడు.

"ఐతే ఏం చెయ్యమంటారు డాక్టర్? ఈ తలకాయ చెడిన వానిలో వేగలేక చస్తున్నాను," అని నర్సు అడిగింది.

"రేపు పరీక్ష చేసి, పిచ్చి పట్టివుంటే పిచ్చాసుపత్రికి పంపిస్తాంలే. అంతవరకు జాగ్రత్తగా చూస్తూ వుండు." అని చెప్పి డాక్టర్ పోయినాడు.

పాపం వీనికి నిజంగా తల చెడి పిచ్చి పట్టింది" అని జాలిపడుతూ నర్సు కూడా మరొక పని మీద పోయింది.

వాళ్ళ మాటలు విని తనకు నిజంగా పిచ్చి పట్టిందేమో

అని విక్రమార్కునికి భయం కలిగింది. డాక్టరూ, నర్సూ పోయిన తర్వాత కొంచెం సేపటికి కండ్లు తెరిచి లేచి మంచం మీద కూర్చొని భయంతో పిచ్చి చూపులు చూస్తూ అటు యిటూ చూసినాడు. ప్రక్కన మరొక మంచంమీద వున్న రోగి తన వైపు చూస్తూ వుండడం గమనించి ''నాకు నిజంగా పిచ్చి పట్టిందా?'' అని విక్రమార్కుడు అడిగినాడు.

''నీ మాటలు చూస్తే పిచ్చిపట్టినట్లే వుంది'' అన్నాడు. ఆ రోగి.

''నిజం మాట్లాడితే పిచ్చిపట్టినట్లా?'' అన్నాడు విక్రమార్కుడు.

''ఐతే నీకు రెండువేల ఏండ్లు వయస్సు వుందా?'' అంటూ ఆ రోగి నవ్వినాడు.

తన మాటలు యెవ్వరూ నమ్మడంలేదని విక్రమార్కునికి చాలా బాధ కలిగింది. యెవరితో ఏమి చెప్పినా నమ్మేటట్లే లేరు. పైగా తనకు పిచ్చిపట్టిందని అంటున్నారు. యింక యెవరితోనూ ఏమీ మాట్లాడకూడదని ఆయన మౌనంగా వుండినాడు. మౌనంగా వున్న విక్రమార్కునితో ఆ రోగి ''రేపు నిన్ను పిచ్చాసుపత్రికి పంపుతారులే. అక్కడ నీ యిష్టం వచ్చిన పిచ్చిచేష్టలు చేస్తూ, నీ యిష్టం వచ్చిన పిచ్చి మాటలు మాట్లాడుతూ, హాయిగావుండవచ్చు. అక్కడందరూ నీ వంటి పిచ్చివాళ్లే వుంటారు.'' అంటూ పరిహాసం చేసినాడు.

అతని పరిహాసంచూసి విక్రమార్కునికి యింకా బాధ కలిగింది. యిక్కడనుండి వెంటనే తప్పించుకొని పోతే తనకు నిజంగా పిచ్చిపట్టేటట్లు వుంది. అందరూ తన్ను యెగ

తాళి చేసేవాళ్ళే. అందరూ తన్ను తిట్టేవాళ్లే. యింత బాధ ఐతే ఏ మనిషికైనా తప్పక పిచ్చిపట్టుతుంది అనుకున్నాడు ఆయన. తప్పించుకొని పోవడానికి ఆలోచన చేస్తూ, ప్రక్కన వున్న రోగిని ''యిక్కడనుండి తప్పించుకొని పోవాలంటే యెట్లు?'' అని అడిగినాడు.

''సాయంత్రం చీకటిపడేటప్పుడు మెల్లగా లేచి వెళ్ళి పో. అప్పుడైతే యెవ్వరూ తెలుసుకోలేరు.'' అని ఆ రోగి చెప్పినాడు.

సాయంత్రంవరకు విక్రమార్కుడు కదలకుండా పండుకున్నాడు. కదలకుండా పండుకొన్న విక్రమార్కునికి ఉదయం నుండి జరిగిన సంగతులన్నీ క్రమంగా ఒకటొకటే జ్ఞాపకంవచ్చి నాయి. కల్యాణి జ్ఞాపకం వచ్చి ''పాపం, ఆ రాజకన్య నన్ను గాఢంగా ప్రేమించింది. నా కొరకు ఆమె యెంతగా బాధ పడుతూ వుందో? వెంటనే నేనామెను పెండ్లి చేసుకోకపోతే యింకా యెంత బాధపడుతుందో?'' అనుకున్నాడు. యింత సేపు ఆమెను మరచిపోయినందుకు చాలా నొచ్చుకున్నాడు. తన వంటి వీరాధివీరుడు తన్ను ప్రేమించిన రాజకన్యనుయింత సేపు మరచిపోవడం చాలా ఘోరమైన విషయం అని తన్ను తాను నిందించుకున్నాడు.

కల్యాణినీ, కల్యాణి ప్రేమనూ తలచుకొనే కొద్దీ ఆయ నకు కల్యాణి మీద పట్ట శక్యం కాని ప్రేమ పుట్టింది. ''ఎంత విక్రమార్కుడైనా యింత ప్రేమభరింపగలడా, హా కల్యాణీ!'' అనుకుంటూ, కళ్యాణినే తలచుకుంటూ, క్షణం ఒక యుగంగా సాయంత్రం ఐదు గంటల వరకూ గడపినాడు. అప్పుడు రోగులను చూడడానికివాళ్ళబంధువులూ స్నేహితులూచాలా

మంది ఆస్పత్రికి వచ్చి అటూ యిటూ తిరుగుతూ వుండినారు. వచ్చే పొయ్యే మనుషులను చూసి విక్రమార్కుడు ఇదే సమయమనుకొని, మెల్లగా లేచి ఆస్పత్రినుండి బయటికి పోయే వాళ్లలో కలిసి, వాళ్ల వెంబడే గేటుదాటి బయట పడినాడు.

## 6

వీధిలో వచ్చే పోయే జనంలో కలిసి ఆయన ఆ వీధి వెంబడే పోతూ వుండినాడు. అది ఏ వీధి అయింద్నీ, ఆ వీధి ఎక్కడకు పోయేదీ తెలియకుండా, కల్యాణిని తలచుకుంటూ, కల్యాణిని వివాహ మాడడానికి మార్గాలు ఆలోచించుకుంటూ పోతూ వుండినాడు. ''ఆ రాజ కన్య నా కొరకు తప్పక యెదురు చూస్తూ వుంటుంది. పాపం, నా మీది ప్రేమతో ఎంత అవస్థ పడుతూ వుందో? నేను కనపడలేదని ఎంతగా దుఃఖిస్తూ వుందో?'' అనుకుంటూ, సమయానికి గుర్రం కూడా లేక పోయెనే అని విచారిస్తూ పోతూ వుండగా, ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. ''పేదరాశి పెద్దమ్మ ఇంట్లో మకాం వేస్తే సరిపోతుంది. రాజకన్యల సంగతులన్నీ పేదరాశి పెద్ద మ్మకు తెలిసే వుంటాయి. కల్యాణిని పెండ్లి చేసుకోడానికి పెద్దమ్మే ఏదో ఒక ఉపాయం చెప్పుతుంది.'' అనుకున్నాడు. విక్రమార్కుడు. ఈ ఆలోచన వస్తూనే కల్యాణిని పెండ్లి చేసుకున్నట్లే సంతోషించి వేగంగా నడక సాగించినాడు.

వేగంగా నాలుగడుగులు ముందుకువేసి, ఎదురుగా వస్తున్న ఒక మనిషిని చూసి, విక్రమార్కుడు ''అయ్యా, పేదరాశి పెద్దమ్మ ఇల్లెక్కడ?'' అని అడిగినాడు.

ఆ మనిషికి అర్థంకాక ''ఎవరూ?'' అన్నాడు.

''ఈ పట్నంలో పేదరాశి పెద్దమ్మ ఎక్కడుంది?'' అన్నాడు విక్రమార్కుడు.

''పిచ్చి వెధవ!'' అని నవ్వుకుంటూ ఆ మనిషి పోయినాడు.

''ఛీ! ఈ పట్నంలో ఎవరికీ బుద్ధే లేదు'' అనుకుంటూ విక్రమార్కుడు ఇంకా పది అడుగులు ముందుకు నడిచి ఎదురుగా వచ్చే మరొక మనిషిని నిలిపి, ''అయ్యా, ఈ పట్టణంలో పేదరాశి పెద్దమ్మ ఎక్కడుంది!'' అని వినయంగా అడిగినాడు.

''పెద్దమ్మ ఎవరోయ్ దద్దమ్మా?'' అంటూ ఆ మనిషి కూడా నవ్వుతూ పోయినాడు.

విక్రమార్కునికి అందరి మీదా కోపం వచ్చింది. భూలోకం మీదనే కోపం వచ్చింది. ''భూలోకంలో ఎవ్వరికీ బుద్ధిలేదు'' అనుకుంటూ ఇంకా ముందుకు పోయినాడు.

కొంతదూరం పోయేటప్పటికి ఒక కొళాయి దగ్గర నలుగురైదుగురు ఆడవాళ్ళు నీళ్ళు పట్టుకుంటూ వుండినారు. వాళ్ళ నడిగి పెద్దమ్మ ఇల్లు తెలుసుకుందామని విక్రమార్కుడు వాళ్ళ దగ్గరికి పోయినాడు. కొళాయిలో నీళ్లు రావడం చూసి ఆయనకు ఆశ్చర్యమైంది. ''ఇదేమిటి? నీళ్లు ఎక్కడనుండి వస్తున్నాయి? మా కాలంలో ఎక్కడా యిటువంటిది లేదే!'' అనుకుంటూ కొళాయి వైపు చూస్తూ వుండినాడు. ఆయన ధరించిన వింతవస్త్రాలూ, తలకు కట్టుకొన్న కట్టూ చూసి, అక్కడున్న ఆడవాళ్లు''వీడెవడో రాడీ వెధవ'' అనుకున్నారు.

''ఈ నీళ్లు ఎక్కడ నుండి వస్తున్నాయి?'' అని విక్రమార్కుడు వాళ్ళలో ఒకామెను అడిగినాడు.

''ఎక్కడనుండి వస్తే నీకేం? పాతాళం నుండి వస్తున్నాయి'' అని ఆమె విసురుగా సమాధానం చెప్పింది.

విక్రమార్కునికి యింకా ఆశ్చర్యమైంది. ''ఈ ప్రజలకు పాతాళగంగ వస్తూ వుంది. ఈ పట్టణం రాజుకు ఎంత శక్తి వుందో!'' అని ఆయన ఆశ్చర్యపడుతూ వుండగా, యింకో కామె కోపంతో చిమచిమలాడుతూ ''నీ కిక్కడ ఏం పని వుంది-పో'' అన్నది.

ఆమె కోపగించుకుందని విక్రమార్కుడు భయపడి ''అంత కోపమెందుకమ్మా? నాకొక మాట చెప్పండి, పోతాను'' అన్నాడు.

''ఏమిటి?'' అన్నది ఆమె.

''పేదరాశి పెద్దమ్మ ఎక్కడుంది?'' అని అడిగినాడు ఆయన.

''వీడెవడో పచ్చి రౌడీగా వున్నాడు. ఆడవాళ్ళతో పరిహాసమాడుతున్నాడు'' అని అక్కడ వున్న వాళ్ళకందరికీ కోపం వచ్చింది. ''మీ పెద్దమ్మను ఎక్కడ పోగొట్టుకున్నావో-మా కేం తెలుసు?'' అని ఒకామె రుసరుసలాడుతూ ముందుకు వచ్చింది.

''మీ పెద్దమ్మ యిక్కడుంటే కనపడదూ, ఎద్దులాగున్నావే మొద్దు మొఖమా?'' అంటూ యింకొక ముసలామె వుత్త బిందె వూగులాడిస్తూ ముందుకు వచ్చింది.

వయస్సులో వున్న మరొకామె నిండు కడవ ఎత్తు

కొని ''నేనే మీ పెద్దమ్మను, పోదాం రా కొడుకా'' అని చేయి తిప్పుతూ వచ్చి విక్రమార్కుని కెదురుగా నిలబడింది.

పేదరాశి పెద్దమ్మ ఆమే నేమోనని విక్రమార్కునికి ఆశపుట్టి ''పెద్దమ్మవు నీవేనా? ఐతే మీ యింటికి పోదాం పద'' అన్నాడు.

వెంటనే ఆమె నీళ్ళ కడవ విక్రమార్కుని నెత్తిమీద కుమ్మరించి ''నేను నీకు పెద్దమ్మనా పోకిరీ వెధవా!'' అంటూ తిట్టింది.

''ఆడవాళ్ళతో పరాచికాలాడుతావా, పాడుముండా కొడుకా!'' అంటూ యింకొకామె యింకొక బిందెడు నీళ్లు కుమ్మరించింది.

''కొళాయి దగ్గర కొంటె కూతలు కూస్తావా, కోతి ముఖమా!'' అంటూ మరొకామె మరొక కడవ కుమ్మరించింది.

''ఇదిగో యింకొక పెద్దమ్మను చూపిస్తా నుండు'' అంటూ నీళ్లు పట్టుకుంటూవుండిన యింకొకామె తన కడవ కూడాఎత్తుకొని వచ్చింది. అది చూసి విక్రమార్కుడు భయపడి''వీళ్లెక్కడి ఆడవాళ్లురా దేవుడా! భూలోకం నిండా భూతాలు చేరుకున్నాయి'' అనుకుంటూ పరుగెత్తినాడు.

భయంతో వెనక్కి తిరిగిచూడకుండాపరుగెత్తిపరుగెత్తి కొంతదూరం పోయిన తర్వాత నిలబడి తిరిగి చూసినాడు. తన వెనుక యెవ్వరూ లేరు. అంతాన్నిర్మానుష్యంగావుంది. భయంతో యెంత సేపు పరుగెత్తినాడో, వూరంతా దాటి వూరిబయటకి వచ్చి చేరినాడు. అక్కడ నిలబడి, వూరివైపు చూస్తూ ''నాయంతటి వానికి యెంతటి దురవస్థ వచ్చిందిరా భగ

వంతుడా! నేను బ్రతికిన కాలంలో వీరాధివీర విక్రమార్క-మహారాజు అంటే భూలోక మంతా భయంతో వణకి పొయ్యేది. నాపేరు చెప్పితే భూత ప్రేత పిశాచాలన్నీ దద్దరిల్లి పొయ్యేవి. నా కీర్తి విని రాజకుమార్తె లందరూ నన్ను చూడ కుండానే ప్రేమించే వాళ్ళు. ఈ నాటికి నేను ఆడవాళ్ళకు భయపడి పారిపోవలసి వచ్చింది.'' అనుకుంటూ అవమా నంతో బాధ పడినాడు. మరికొంత సేపు కల్యాణిని తలచు కుంటూ ''ఆ రాజకుమార్తె నా కొరకు యెంతగా పరితపిస్తూ వుందో! నా మీది ప్రేమతో నిద్రాహారాలు మానుకొని వుంటుంది. పాపం, యిప్పటికే యెంతగా చిక్కి-పోయిందో!'' అనుకుంటూ బాధ పడినాడు. తరువాత కొంతసేపు ''పేద రాశి పెద్దమ్మ కూడా యెక్క-డుందో కనపడదు. ఎవ్వరి నడిగినా చెప్పరు. పూర్వం మా కాలంలో ప్రతి పట్టణం లోనూ ఒకే పేదరాశి పెద్దమ్మ వుండేది. ఏ వూరికి పోయినా పేదరాశి పెద్దమ్మ యింట్లో దిగేవాళ్ళం. పెద్దమ్మ నడిగితే పట్నంలోని విశేషాలన్నీ చెప్పేది. రాజవీధిలో పోతూ రాజ కన్యను చూసి ప్రేమిస్తే, ఆ రాజకన్యను పెండ్లి చేసుకో డానికి కూడా పెద్దమ్మే ఉపాయాలు చెప్పేది. ఇప్పుడీ పట్నంలో పెద్దమ్మ కనపడకపోతే నా గతేమి?'' అనుకుంటూ బాధ పడినాడు.

అన్ని బాధలతోనూ బాధ పడుతూ, విక్రమార్కు-డు గోడమీద నిలబడి వూరివైపు చూస్తూ, ఏమీ చేయడానికీ తోచక దిగులు పడుతూ వుండగా, హఠాత్తుగా వీధి లైట్లన్నీ ఒకేసారి వెలిగినాయి. ఆయనకు బ్రహ్మాండమైన ఆశ్చర్యం కలిగింది. ''ఏమిటిది? మంత్రించినట్లు దీపాలన్నీ ఒకేసారి

వెలిగినాయి?'' అని ఆయనకు ఆశ్చర్యంతో పాటు భయం కూడా కలిగింది. తనకు దగ్గరలోనే నాలుగు గజాల దూరంలో స్తంభం మీద దీపం వెలుగుతూ వుంది. స్తంభానికి సన్నని తీగలు వున్నాయి. ''మా కాలంలో దివిటీలూ, దీపింతలూ వెలిగించుకునే వాళ్ళం. ఇదేమి దీపమో అర్థమే కావడం లేదు. ఇది మాయో - మంత్రమో!'' అనుకుంటూ దిక్కు తెలియని ఆశ్చర్యంతో ఆయన దిక్కులు చూసినాడు.

కొంత దూరంలో ఒక సత్రం కనపడింది. ఆ సత్రం అరుగుమీద ఒక బైరాగి కూర్చొని వుండినాడు. ఆ బైరాగిని చూసి విక్రమార్కునికి ప్రాణం లేచి వచ్చింది. బైరాగి గడ్డమూ, కాషాయ వస్త్రాలూ చూసి ''యెవరో మునీశ్వరుడు - నా కోసమే వచ్చినట్లుంది.'' అనుకుంటూ ఆయన వెంటనే బైరాగి దగ్గరికి పోయి ''స్వామీ, రక్షించండి. ఆపదలో వున్నాను.'' అంటూ చేతులు జోడించి నమస్కారం చేసినాడు.

బైరాగికి ఆయన యెవరైందీ అర్థం కాలేదు. బట్టలు చూస్తే సన్యాసీ కాదు, సంసారీ కాదు. ఆ బట్టలు కూడా తడిసి నీళ్ళు కారుతున్నాయి. ఎవరో అడుక్కునేవాడు అయి వుంటాడని ''ఎవరు నీవు-బుడబుడకల వానివా?'' అన్నాడు.

''మీకు తెలియందేముంది స్వామీ? మీరు మహాత్ములు - తపస్సు చేసిన వాళ్ళు.'' అన్నాడు విక్రమార్కుడు భక్తితో.

బైరాగి విక్రమార్కుని బుడబుడకల వాడే అనుకున్నాడు. తడిసిన బట్టలు మార్చుకుంటాడేమో అని ''యేం కావాల? నా అంగీ యిచ్చేదా!'' అన్నాడు.

''కాదు స్వామీ, నాకు పేదరాశి పెద్దమ్మ కావాల.'' అన్నాడు విక్రమార్కుడు.

''ఓరి పిచ్చి కీనుగా, పేదరాశి పెద్దమ్మ యిక్కడెక్కడుంది?'' అన్నాడు బైరాగి విసుక్కుంటూ.

మునీశ్వరులు అంత సులభంగా వరాలు యిస్తారా అనుకొని విక్రమార్కుడు, యింకా భక్తి ఉట్టి పడేటట్లు ''స్వామీ, మీరు మహానుభావులు. భూత భవిష్యత్తులన్నీ తెలిసినవాళ్ళు. నన్ను కనికరించి పేదరాశి పెద్దమ్మ యెక్కడుందో చెప్పండి.'' అన్నాడు.

బైరాగికి కోపం వచ్చి ''పేదరాశి పెద్దమ్మ సంతలో ఉంటుంది-పావలాకొకటి యిస్తారు-కొనుక్కోపో'' అన్నాడు.

''సంతలో వుండదు స్వామీ''అన్నాడు విక్రమార్కుడు దీనంగా.

''సంతలో వుండకపోతే నా జేబులో వుందా!'' అన్నాడు బైరాగి కోపంగా.

''మీరే చెప్పండి స్వామీ!''అన్నాడు విక్రమార్కుడు.

''ఇదెక్కడి పీడరా తండ్రీ!'' అనుకుంటూ బైరాగి ''పేదరాశి పెద్దమ్మంటే నాకు తెలియదు.'' అన్నాడు.

''తప్పుళ్ళక్షి సంపన్నులు, మీకు తెలియందేముంది స్వామీ-పేదరాశి పెద్దమ్మంటే డబ్బు తీసుకొని అన్నం వండి పెడుతుంది.'' అన్నాడు విక్రమార్కుడు.

''ఓరి పిచ్చిసన్యాసీ, హోటల్ అని అడుగలేకపోయి నావ్! డబ్బు తీసుకొని అన్నం పెట్టే హోటళ్ళు చాలా ఉన్నాయి యీ వూర్లో. ఆకలౌతుందేమో, తినిరా పో!'' అన్నాడు బైరాగి నవ్వుతూ.

''నాకు ఆకలి కాలేదు స్వామీ. పేదరాశి పెద్దమ్మ ఎక్కడుందో చెప్పండి.'' విక్రమార్కుడు అన్నాడు యింకా వినయవిధేయతలు చూపిస్తూ.

బైరాగికి మళ్ళీ విసుగు వచ్చి ''నీకేమైనా పిచ్చి పట్టిందా? ఆకలి కాకపోతే పెద్దమ్మతో పనేముంది?'' అన్నాడు.

''రాజకుమారుడు రాజకన్యను ప్రేమించి పెండ్లి చేసుకోవాలంటే పేదరాశి పెద్దమ్మ లేకపోతే యెట్ల స్వామీ? మీకింకా నా మీద కనికరం కలుగలేదా?'' అంటూ విక్రమార్కుడు బైరాగి కాళ్ళు పట్టుకున్నాడు.

బైరాగికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. కాళ్ళు విడిపించుకొని దూరంగా జరిగి ''వీని మాటలు వింటే నాకే పిచ్చి పట్టేటట్లు వుందే!'' అనుకుంటూ, ''రాజకుమారుడూ, రాజకన్యా, ప్రేమా, పెండ్లీ, పేదరాశి పెద్దమ్మా, యేమిటోయ్ యిదీ? నీ కథంతా విడ్డూరంగా వుందే? వివరంగా చెప్పు - ఎవరు నీవు? ఏ వూరు?'' అన్నాడు.

''స్వామీ, నేను ఉజ్జయినీ రాజును. విక్రమార్కుణ్ణి ఈ పట్నంలో కల్యాణి అనే రాజకన్య నన్ను చూసి ప్రేమించింది. నేను కూడా ఆమెను వెంటనే ప్రేమించినాను. ఇంక మా యిద్దరికీ పెండ్లి కావాలంటే పేదరాశి పెద్దమ్మ లేకపోతే యెట్ల స్వామీ?'' అని చెప్పినాడు విక్రమార్కుడు.

ఆ మాటలు విని బైరాగికి నవ్వు వచ్చింది. ''పాపం, వీనికి పిచ్చి ముదిరి పోయింది. వీడేమి మాట్లాడేదీ వీనికే తెలియదు.'' అనుకొని విక్రమార్కుని మీద జాలి పడుతూ ''ఈ వూర్లో పేదరాశి పెద్దమ్మ లేదు నాయనా!'' అన్నాడు.

పేదరాశి పెద్దమ్మ లేని వూరు ఎక్కడైనా వుంటుందా అని విక్రమార్కునికి అనుమానం కలిగింది. తాను అంగ వంగ కళింగ కాశ్మీర దేశాలన్నీ చూసినాడు. మత్స్య మగధ మాళవ కొంకణ కొంకణ దేశాలన్నీ చూసినాడు. ఏ దేశంలోనూ పేదరాశి పెద్దమ్మ లేని వూరే లేదు. ఈ వూర్లో పెద్దమ్మ లేదంటే చాలా విపరీతంగా వుంది. ఐనా యింతటి మునీశ్వరుడు చెప్పిన మాట నిజమే ఐవుంటుందనివిక్రమార్కుడునమ్మినాడు. భూలోకం చాలా మారిపోయింది అనుకొని, బైరాగి వైపు చూస్తూ "పెద్దమ్మ లేకపోతే మరి నా గతేమి స్వామీ?" అన్నాడు దిగులుగా.

ఆయన దిగులు చూసి బైరాగికి యింకా జాలి కలిగింది. కానీ యేమి చెయ్యడానికి తోచక ఏమి మాట్లాడినా లాభం లేదని మౌనంగా వుండినాడు. ఒక నిముషం తర్వాత విక్రమార్కుడు యింకా దీనంగా "మీరే ఏదైనా ఉపాయం చెప్పండి స్వామీ! ఈ దీనుని రక్షించి పుణ్యం కట్టుకోండి స్వామీ!" అన్నాడు.

"నన్నేమి చెయ్యమంటావు నాయనా? నీకు సహాయం చేసే శక్తి నాకు లేదు. నీ పిచ్చి కుదర్చడం నా చేతగాదు." అన్నాడు బైరాగి జాలిగా.

"మీకు చేతగాని దేముంటుంది స్వామీ? మీరు మహానుభావులు. మీరు తలచుకుంటే ఏమైనా చేయగలరు. మీ తపశ్శక్తితో నన్ను ఆ రాజకన్య అంతఃపురంలో చేర్చండి. లేకపోతే ఏదైనా మామిడి పండు మంత్రించి యివ్వండి. లేకపోతే విభూతి మంత్రించి యివ్వండి. నేనే అంతఃపురంలోకి యెవ్వరికీ కనపడకుండా పోయి, రాజకన్యను యెత్తుకొని

పోయి యెక్కడైనా పెండ్లి చేసుకుంటాను.'' అంటూ విక్రమార్కుడు మళ్ళీ బైరాగి కాళ్లు పట్టుకొన్నాడు. కాళ్లు విడిపించుకోడానికి బైరాగి యెంత ప్రయత్నం చేసినా విక్రమార్కుడు యింకా గట్టిగా పట్టుకున్నాడు.

బైరాగికి పాపం గట్టి చిక్కే వచ్చింది. తనకు మంత్రాలూ తంత్రాలూ ఏమీ తెలియవని యెంత చెప్పినా విక్రమార్కుడు వినడు. తనకు తపశ్శక్తీ లేదు ఏ శక్తీ లేదు అని ఎంత మొత్తుకున్నా విక్రమార్కుడు నమ్మడు. తనకు గడ్డం పెంచుకుని అడుక్కు తినడం తప్ప ఏమీ చేతకాదని ఎంత నమ్మకంగా చెప్పినా విక్రమార్కుడు వినిపించుకోడు. మునీశ్వరులకు చేతగాని దేముంటుందని విక్రమార్కునికి ఒక లే మొండినమ్మకం. పూర్వకాలంలో మునీశ్వరులు మామిడిపండ్లు మంత్రించి యిచ్చేవాళ్లు. లేకపోతే విభూతి మంత్రించి యిచ్చేవాళ్లు. ఆ మంత్ర శక్తితో దేశాటనం చేసే రాజకుమారులు ఎన్నెన్నో ఘన కార్యాలు చేసే వాళ్ళు. విక్రమార్కుడు దేశాటనం చేసేటప్పుడు కూడా మునీశ్వరులతో యిటువంటి సహాయాలు ఎన్నో పొందినాడు. అందుకని ఆ బైరాగిమీద ఆయనకు అంత గట్టి నమ్మకం ఏర్పడి, పట్టుకున్న కాళ్లు వదలిపెట్టకుండా మొండికేసి కూర్చున్నాడు.

ఇంక ఎన్ని చెప్పినా ఈ పిచ్చివాడు వదిలేటట్లు లేడని బైరాగి విక్రమార్కునితో'' నీ రాజకన్య ఎక్కడుందో చెప్పు-మాట్లాడి వస్తాను.'' అన్నాడు.

''అది ఏ వీధో నాకు తెలియదు. మీరే దివ్య దృష్టితో చూడండి స్వామీ!'' అన్నాడు విక్రమార్కుడు.

''నాకు కండ్లు సరిగా కనపడక చస్తూ వుంటే, పైగా

దివ్యదృష్టి ఎక్కడుందిరా తండ్రీ—ఈ గడ్డమూ, ఈ కాషాయ బట్టలూ లేకున్నా బాగుండు, వీటితోనే ఈనాడు నాకీ చావు సంభవించింది.'' అనుకుంటూ బైరాగి విక్రమార్కునితో ''ఆ అమ్మాయి తండ్రి పేరేనా తెలుసునా?'' అన్నాడు.

''రామదాసు.'' అని విక్రమార్కుడు చెప్పినాడు.

''సరే నేను మాట్లాడివస్తాను-యిక్కడే వుండు'' అని బైరాగి బయలుదేరినాడు.

''నేనూవస్తాను స్వామీ.ఆ రాజకన్యను చూడకుండా యింక ఒక క్షణం కూడా వుండలేను.'' అంటూ విక్రమార్కుడు వెంటబడినాడు. తప్పించుకోడానికి వీలులేక బైరాగి ఆయన్ను కూడా పిల్చుకొని పోయినాడు.

యిద్దరూ కలిసి వీధిలో నడుస్తూవుండగా ఎలెక్ట్రిక్ లైట్లను చూసి విక్రమార్కుడు ''స్వామీ, ఈ దీపాలకు వత్తి, నూనె, ఏమీ వున్నట్లే లేదే? మంత్రమూ, మాయా, యిదేమిటి స్వామీ?'' అని అడిగినాడు.

''నీకు మంత్రాల పిచ్చి పూరాపట్టిందే! మంత్రాలూ గాదు, తంత్రాలూ గాదు. యివి కరెంటు దీపాలు.'' అని బైరాగి చెప్పినాడు.

''కరెంటంటే ఏమిటి స్వామీ?'' అన్నాడు విక్రమార్కుడు.

''అదిగో, ఆ తంతెలు వున్నాయి చూడు-ఆ తంతెల్లో ఏదో ప్రవహిస్తూ వుంటుంది. దాన్ని కరెంటు అంటారు. అంతకంటె నాకేం తెలుసు నాయనా, నేను బతకలేని బైరాగిని.'' అన్నాడు బైరాగి.

''మీకు తెలియందేముందీ స్వామీ—మునీశ్వరులకు? నా మీద మీకెందుకో దయ కలుగలేదు. చెప్పండి స్వామీ!'' అంటూ విక్రమార్కుడు బైరాగిని ప్రార్థించినాడు.

''వీనితో మంచి చావు వచ్చేనే!'' అనుకుంటూ బైరాగి ''నన్ను మించిన మునీశ్వరులు వున్నారు నాయనా! అటువంటి మహర్షులు సృష్టించిందే ఈ కరెంటు. దీని మహత్తు తెలుసుకోడానికి నావంటివాళ్ళకు సాధ్యం కాదు.'' అన్నాడు.

ఆ జవాబు విని విక్రమార్కుడు ''మీకంటె గొప్ప మహర్షులు వున్నారా స్వామీ! వాళ్ళు ఎక్కడ వుంటారు?'' ఎక్కడైనా గుహల్లో తపస్సు చేస్తూ వుంటారా? నాకు దర్శనం కలిగే మార్గం చెప్పండి స్వామీ!'' అన్నాడు.

''వీనితో ఏం మాట్లాడినా నెత్తికి వస్తుంది గదరా దేవుడా!'' అనుకుంటూ బైరాగి చెప్పినాడు. ''ఆ మహర్షులను యింజనీర్లు అంటారు. వాళ్లు తపస్సుచేసి సిద్ధిపొందిన తర్వాత మానవజాతిని ఉద్ధరించడానికని పట్టణాల్లో నేకాపురం వుంటారు. నాబోటి వాళ్ళకు వాళ్ళ దర్శనం కాదు నాయనా! ఎంతో పుణ్యం చేసుకున్న వాళ్ళకు తప్ప వాళ్ళ దర్శనం దొరకదు.''

బైరాగి మాటలతీరు చూసి విక్రమార్కునికి అప్పటికి తృప్తి కలిగింది. ఈ మునీశ్వరునికి నా మీద యిప్పటికి దయ కలిగింది అని సంతోషిస్తూ బైరాగి వెంట నడుస్తూవుండినాడు. కొద్ది నిముషాల్లో యిద్దరూ వూరిలో ప్రవేశించినారు. రామదాసుగారి యిల్లు ఎక్కడ అని బైరాగి రెండు మూడు చోట్ల విచారించగా, రామదాసు అనే వకీలు ఫలానా వీధిలో వున్నాడని తెలిసింది. తరువాత పది నిముషాల్లో రామదాసు

వున్న వీధి చేరుకున్నారు. ఆ వీధిని విక్రమార్కుడు వెంటనే గుర్తుపట్టి సంతోషం పట్టలేక "యిదే స్వామీ – యీ వీధిలోనే నా రాజకన్య వుండేది – యీ వీధిలోనే నా ప్రేమ సుందరి వుండేది – ఈ వీధిలోనే నా జగన్మోహిని వుండేది." అంటూ తన ప్రేమంతా వెళ్ళబోసుకున్నాడు. బైరాగి విసుక్కుంటూ "నీ వాగుడు కట్టి పెట్టరా బాబూ – యెవరైనా వింటే మన వీపులు విరగ్గొడతారు. నిశ్శబ్దంగా రా—" అని చెప్పినాడు. మరికొన్ని క్షణాల్లో వాళ్ళకు రామదాసు యిల్లు కనపడింది. విక్రమార్కుడు ఉత్సాహంతో ఉప్పొంగిపోతూ "అదే అదే స్వామీ! నా సుందరాంగి వుండే సౌధం అదే – నా అందాలరాశి వుండే అంతఃపురం అదే – నా మనోహరి వుండే మహల్ అదే" అంటూ మళ్ళీ వాగుడు ప్రారంభించినాడు. బైరాగికి విక్రమార్కుని మీద కోపమూ వచ్చింది, ఎవరైనా వింటే యేమంటారో అని భయమూ కలిగింది. ఆ కోపంతోనూ భయంతోనూ "నోరు మూసుకోరా భడవా, యెవరైనా వింటే మన కండలు కోసి కాకులకు వేస్తారు, జాగ్రత్త!" అని గద్దించినాడు.

రామదాసు యింటి ముందు వసారాలో గోపీ మరి కొందరు పిల్లవాండ్రతో కలిసి ఆడుకుంటూ వుండినాడు. విక్రమార్కుడూ, బైరాగీ మాట్లాడుకోవడం గోపీకి వినపడింది. అప్పటికి వాళ్ళిద్దరూ ఆ యింటికి చాలా దగ్గరగా వచ్చినారు. గోపీ వెంటనే విక్రమార్కుని గుర్తుపట్టి "సర్కస్ బఫూన్ అడుగో, చూడండిరా." అని పిల్లవాండ్లకందరికీ చూపించి, ఉదయం జరిగిన సంగతులన్నీ జ్ఞాపకం వచ్చి ఇంట్లోకి పరుగెత్తి విక్రమార్కుని కిరీటం తీసుకొని వచ్చినాడు.

ఉదయం విక్రమార్కుని తలమీద నుండి జారిపడిన కిరీటాన్ని రామదాసు తీసి యింట్లో పెట్టి వుండినాడు. గోపీ ఆ కిరీటాన్ని తలమీద పెట్టుకొని ''ఏం మార్కు కావాల-చక్రం మార్కు కావాల; యేం మార్కు కావాల-విక్రమార్కు కావాల.'' అంటూ కేకలు వేసినాడు. పిల్లలందరూ విక్రమార్కుని చుట్టూ, బైరాగి చుట్టూ మూగి, గోపీ వేసినట్లే కేకలు వేస్తూ గంతులు వేయసాగినారు.

ఆ కిరీటం తన దేనని చూపించి ఉదయం జరిగిన కథంతా విక్రమార్కుడు బైరాగికి చెప్పి ''యింక అంతఃపురంలోకి పొయ్యే మార్గం చూడండి స్వామీ. నా సుందరాంగిని చూడకపోతే నా ప్రాణం నిలవనే నిలవదు స్వామీ!'' అంటూ తొందరించినాడు.

విక్రమార్కుని తొందర చూసి బైరాగికి భయం పట్టుకుంది. ''వీనికెట్లైనా ఈ రోజు దెబ్బలు తప్పవు. వీని పిచ్చి కూతలు వింటే ఎవరైనా యెముకలు విరిగిందాకా తంతారు. అసలు అంత మాత్రం దేహశుద్ధి అయితే తప్ప వీనికి పిచ్చి వదిలేటట్లు లేదు. వీని వెంట వుంటే నాక్కూడా యెముకలు విరుగుతాయి.'' అనుకొని, తప్పించుకోడానికి మార్గం ఆలోచించినాడు. ఒక క్షణం ఆలోచించి వంగి నేలమీద దుమ్ము ఒక చిటికెడు తీసుకొని ''ఓం, హ్రీం, క్లీం, బ్రూం, ప్లూత్ర్యాం, ఖ్రూం.'' అంటూ మంత్రించినాడు. ఆ దుమ్ము విక్రమార్కుని తలమీద చల్లి ''యింక నేరుగా ఆ యింట్లోకి పో. రాజకన్య నిన్ను చూస్తూనే నీ వెంట వచ్చేస్తుంది,

రామదాసు నిన్ను చూస్తూనే నీకు పెండ్లి చేస్తాడు. నీ కోరిక దిగ్విజయంగా నెరవేరుతుంది. నీకేమీ భయము లేదు పో - నా మంత్రశక్తి నిన్ను రక్షిస్తుంది.'' అని చెప్పినాడు.

విక్రమార్కునికి పరమానందమైంది. మునీశ్వరుని మంత్రశక్తితో ముల్లోకాలూ జయించవచ్చునని ధైర్యం కలిగింది. ''మహాత్మా, ధన్యుడను!'' అంటూ తల వంచి బైరాగికి దండం పెట్టినాడు. బైరాగి చేయెత్తి ''వెంటనే వివాహ ప్రాప్తిరస్తు.'' అని దీవించినాడు. విక్రమార్కుడు మరొకసారి బైరాగికి దండం పెట్టి, ఠీవిగా నిలబడి, దర్జాగా అడుగులు వేసుకుంటూ, ఒక క్షణంలో రామదాసు యింట్లో ప్రవేశించినాడు. మరు క్షణంలోనే బైరాగి ''ఈ పిచ్చివాని పీడ యిప్పటికి వదిలిందిరా దేవుడా!'' అనుకుంటూ అక్కడి నుండి పారిపోయినాడు.

రామదాసు కుర్చీలో కూర్చుని యేవో వ్రాసుకుంటూ వుండగా, విక్రమార్కుడు ఠీవిగా దర్జాగా పోయి యెదుట నిలబడినాడు. ''ఎవరు నీవు?'' అంటూ రామదాసు తలయెత్తి చూసినాడు.

''నేనే - వీరాధివీర విక్రమార్క మహారాజును.'' అన్నాడు విక్రమార్కుడు దర్పంగా.

రామదాసు ఆయన్ను గుర్తు పట్టి ''ఏం? మళ్ళీ ఎందుకొచ్చినావు?'' అని అడిగినాడు కఠినంగా.

విక్రమార్కుడు యింకా దర్పంగా ''మీ కుమార్తెను పెండ్లి చేసుకుంటాను.'' అన్నాడు.

ఆ మాట వినేటప్పటికి రామదాసుకు రాక్షస కోపం వచ్చి ''దొంగ రాస్కెల్, యెవనివిరా నీవు? బయటికి దాటు ముందు.'' అని ఉగ్రరూపం ధరించి లేచి నిలబడినాడు.

అతని కోపం లెక్క చెయ్యకుండా విక్రమార్కుడు ''మీ కుమార్తె నన్ను వరించింది.'' అన్నాడు.

రామదాసుకు మితిమీరిన కోపం వచ్చింది. ''తప్పుడు ముండా కొడుకా, మా యింట్లోకి వచ్చి తప్పుడు కూతలన్నీ కూస్తున్నావా?'' అంటూ కేకలు వేస్తూ కన్నూ మిన్నూ కనపడని కోపంతో చిందులు త్రొక్కినాడు.

రామదాసు ఎంత కోపగించుకున్నా విక్రమార్కునికి ఏ మాత్రం భయం కలగలేదు. మునీశ్వరుని మంత్ర శక్తి వల్ల తన కోరిక తప్పక నెరవేరుతుందనే నమ్మకంతో ధైర్యంగా అక్కడ వున్న కుర్చీలో కూర్చుని ''అంత కోప మెందుకు రామదాసూ? నేను ఉత్తమ క్షత్రియ వంశానిం చెందిన చక్కని రాజకుమారుణ్ని. వీరాధివీర విక్రమార్క మహారాజును. మీ కుమార్తెను నాకిస్తే మీ వంశం పావన మౌతుంది. నీ జన్మ తరిస్తుంది.'' అని గంభీరంగా ఉపన్యాసం యిచ్చినాడు.

''వీడు మాటలతో పొయ్యేటట్లు లే''దని రామదాసు టేబుల్ మీదవున్న టెలిఫోన్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు రిపోర్టు చేసి, పది మంది పోలీసువాళ్ళను పంపమని కోరినాడు. తరువాత విక్రమార్కునివైపు చూస్తూ కోపం పట్టలేక పండ్లు

కోరుకుతూ "అక్కే కూర్చొని వుండు నీ కిప్పుడే పెండ్లౌ తుంది" అన్నాడు.

ఆ మాట విని విక్రమార్కుడు తనకు వెంటనే పెండ్లి ఔతుందనే నమ్మినాడు. "మునీశ్వరుడు ఎంత తపశ్శక్తి సంప న్నుడో! ఆయన మంత్రం అప్పుడే పని చేస్తూ వుంది." అను కొని సంతోషంతో మైమరచి "వీరాధివీర విక్రమార్క మహా రాజుకూ-జై" అని కేక వేసినాడు.

అంతలో కల్యాణి అక్కడికి వచ్చింది. ఆమెను చూస్తూనే విక్రమార్కునికి ఒళ్ళు తెలియని ఆవేశం వచ్చి "హా ప్రాణేశ్వరీ!" అంటూ కుర్చీలోనుండి లేచి నిలబడినాడు. కల్యాణికి కంపం పుట్టి ఏమైందీ అర్థంకాక పిచ్చి చూపులు చూస్తూ నిలబడింది. విక్రమార్కుడు రామదాసు వైపు తిరిగి "ఈమె నన్ను వరించిందో లేదో యిప్పుడైనా తెలుసు కున్నావా?" అన్నాడు.

"ఎవడు కల్యాణీ వీడు?" అని రామదాసు కూతురు నడిగినాడు.

"నాకేం తెలుసు నాన్నా? యెవడో సర్కస్ మని షేమో?" అని చెప్పింది కల్యాణి.

"మనకు మునీశ్వరుని మంత్ర మహిమ వుందిలే కల్యాణీ. భయపడకుండా నిజం చెప్పు. నేను విక్రమార్కుని వరించినానని మీ నాన్నతో చెప్పు" అన్నాడు విక్ర మార్కుడు.

విక్రమార్కుణ్ని ముక్కలు ముక్కలుగా నరుకుదా మన్నంత కోపం వచ్చింది రామదాసుకు. కల్యాణికి కూడా ఆయన్ను చిత్రవధ చెయ్యాలన్నంత కోపం వచ్చింది. కోపంతో పాటు అసహ్యం కూడా కలిగింది. ఆమె వెంటనే టేబుల్ మీదవున్న యింకిబుడ్డి తీసుకొని విక్రమార్కుని ముఖం మీద విసరివేసింది. విక్రమార్కుని ముఖమంతా యింకీ నిండుకుంది. కండ్లలో కూడా పడింది. విక్రమార్కుడు కండ్లు నులుము కుంటూ "యిదేమి విడ్డూరం? రాజకన్య లెక్కడైనా యిట్లా ప్రవర్తిస్తారా? రాజకుమారులు కనపడితే వాళ్ళను వరించి వెంటనే వాళ్ళ వెంట వెళ్ళి పోతారుగానీ ఇట్లా రంగు నీళ్ళు మీద చల్లుతారా" అనుకున్నాడు. కండ్లు నులుముకోవ డంలో విక్రమార్కుని ముఖమంతా నల్లగ ఆఫ్రికా అడవి మనిషి మాదిరి వికృతంగా తయారైంది.

ఈ కాలంలో రాజకన్యలు రాజకుమారులమీద రంగు నీళ్ళు చల్లడం మామూలేమో అని విక్రమార్కుని కొక ఆలో చన వచ్చింది. ఆ ఆలోచనతో పాటు మునీశ్వరుని మంత్ర శక్తి జ్ఞాపకం వచ్చి, మళ్ళీ ధైర్యం తెచ్చుకొని "యింక ఆలస్యమెందుకు సుందరాంగీ? నా వెంట వచ్చేసెయ్. వెంటనే వివాహం చేసుకుందాం." అంటూ కల్యాణి దగ్గిరికి పోయి నాడు. ఆ మాటలూ, ఆ వింతవేషమూ, వికృతమైన ముఖమూ చూసి కల్యాణి భయపడి కెవ్వున కేక వేసి తండ్రి చాటుకు పరుగెత్తింది.

ఇంతలో జీపులోనుండి అరడజను మంది పోలీసులు దిగి యింట్లోకి వచ్చినారు. వాళ్ళకు విక్రమార్కుణ్ని చూపించి రామదాసు ''వాడే రౌడీ వెధవ; మా ఇంట్లో యెంత అల్లరి చేస్తున్నాడో చూడండి.'' అని చెప్పినాడు.

''రాజభటులెందుకు వచ్చినారు?'' అని విక్రమార్కుడు ఆశ్చర్యపడుతూ వుండగానే పోలీసులు వచ్చి చేతులు పట్టుకున్నారు.

''వదలండి. నేనెవరనుకున్నారో?'' అని ఆయన హుంకరిస్తూ విడిపించుకోడానికి ప్రయత్నం చేసినాడు.

''నీ వెవ్వరైతే మా కేంరా బద్మాష్?'' అంటూ ఒక పోలీసు ఆయన్ను చెంపమీద గట్టిగా కొట్టినాడు.

''మా మీదికే తిరుగబడుతావ్?'' అంటూ ఇంకొక పోలీసు వీపుమీద గ్రుద్దినాడు.

''ఈ ముఖం చూడు, పిశాచి ముఖం!'' అంటూ మరొక పోలీసు మోచేత్తో పొడిచినాడు. యింకొకడు తల మీద తన్నినాడు. మరొకడు చెంపమీద మరొకటి అంటించినాడు. వేరొకడు వీపుమీద వేరొకటి తగిలించినాడు. ఈ విధంగా తలా ఒక తన్ను తన్నేటప్పటికి విక్రమార్కుడు దిక్కు తెలియక ఉక్కిరిబిక్కిరై ''హా, ముసీశ్వరా, యిదేనా మీ మంత్రప్రభావం!'' అనుకున్నాడు. రామదాసు వాళ్ళ చుట్టూ తిరుగుతూ ''తన్నండి–యింకా తన్నండి–బాగా తన్నండి— రోగం కుదిరిందాకా తన్నండి–చర్మం వదిలిందాకా తన్నండి''

అని సలహా లిస్తూ యింతసేపూ అణచుకొన్న కోపమం-
వెళ్ళగక్కినాడు. పోలీసులు విక్రమార్కుడికి యింకా నాలు
వడ్డించి "నడు—పోలీస్ స్టేషన్‌కు." అంటూ లాగినారు. "నాకె
భయమనుకున్నారా? మీ రాజుతోనే మాట్లాడుదాం పద.
అంటూ విక్రమార్కుడు వాళ్ళ వెంట నడచినాడు. బయట
గోళీలతో కలిసి ఆడుకుంటూ వుండిన పిల్లవాండ్లు విక్రమార్కుడి
వికృతాకారం చూసి సంతోషం పట్టలేక "ఏం మార్కు
కోతి – విక్రమార్కు కోతి; యేం మార్కు డబ్బా-చక్ర
మార్కు డబ్బా." అంటూ చప్పట్లు కొడుతూ ఆడు
కున్నారు.

# 7

పోలీసులు విక్రమార్కుణ్ణీ, రామదాసునూ జీపులో పోలీస్
స్టేషన్‌కు తీసుక పోయినారు. అక్కడ వున్న సబ్ ఇన్
స్పెక్టర్ విక్రమార్కుణ్ణి చూసి "యెక్కడ దొరికిందిరా
ఈ అడవి జంతువు? జంతుశాలకు పంపించకూడదూ?" అంటూ
నవ్వినాడు.

రామదాసు సబ్ ఇన్‌స్పెక్టర్‌తో "అడవి జంతువు
కాదు సార్. వీడెవడో పచ్చి రౌడీ వెధవ. వీనికి ఒళ్ళంతా
పొగరెక్కింది కండ్ల కావరం యెక్కింది" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ విక్రమార్కుణ్ణి అడిగినాడు: "యెవ
డవురా నీవు?"

"నీ వెవరు? నీవు రాజువు కాదే? రాజోద్యోగివా?"
అన్నాడు విక్రమార్కుడు.

''నీకు రాజులూ రాణులూ కావాల్నేం? మర్యాదగా నీ వెవరో చెప్పు. లేకపోతే నీచర్మం వొలిపిస్తాను.'' అన్నాడు సబ్ ఇన్‌స్పెక్టర్ కోపంగా.

''నే నెవరైతేనేం? అతని కూతురు కల్యాణి నన్ను వరించింది. నేను కూడా ఆమెను వెంటనే వరించినాను.'' అన్నాడు విక్రమార్కుడు ధిక్కారంగా.

''చూడండి సార్ - వీనికెంత తలపొగరో!'' అని రామదాసు సబ్ ఇన్‌స్పెక్టర్‌తో చెప్పినాడు.

''నీ ముఖం చూస్తే నిన్ను వరించేటట్లే వుంది. చెప్పు వెధవా, ఎవరు నీవు?'' అంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ గ్రుడ్లురిమినాడు.

''నేను వీరాధివీర విక్రమార్క మహారాజును. నన్ను వరించిన రాజకన్యలను నేనువివాహమాడుతాను. ఈ కాలంలో అదీ తప్పేనా?'' అన్నాడు విక్రమార్కుడు.

సబ్ ఇన్‌స్పెక్టర్ కోపం పట్టలేక ''ఒరేయ్, మాటలతో వీనికి పొగ రణగేటట్లు లేదు. లాకప్‌లో పెట్టి తెల్లవారిందాకా చితక తన్నండి.'' అని పోలీసులతో చెప్పినాడు.

విక్రమార్కుడు యింకా ధిక్కారంగా ''ఎందుకు తంతారు? కావాలంటే కల్యాణికి స్వయంవరం ఏర్పాటు చేయించండి. స్వయం వరంలోనే ఆమె నన్ను వరిస్తుంది. రాజకుమారుల నందరినీ జయించి నేనే ఆమెను పెండ్లి చేసుకుంటాను.'' అన్నాడు.

''నీకు స్వయంవరమే ఏర్పాటు చేస్తాం రావోయ్.''
అంటూ నలుగురు పోలీసులు వచ్చి ఆయన్ని లాక్కుపోయి లోపల గదిలో పెట్టి బాగా తన్నసాగినారు. దెబ్బలు తింటూ విక్రమార్కుడు ''భూలోకం యెంతగా మారిపోయిందిరా భగవంతుడా! మనుషులు బ్రతకడానికే వీలులేకుండా ఐపోయిందే!'' అనుకున్నాడు.

''దేవేంద్రుడు ఎంత చెప్పినా వినకుండా వచ్చినందుకు నాకు మంచి శాస్తి కుదిరింది. బుద్ధి వున్న వాడెవ్వడూ ''భూలోకం మీద ఒక క్షణం వుండడు'' అనుకోని, దేవేంద్రుడు చెప్పిన మాటలు జ్ఞాపకం తెచ్చుకొని ''స్వర్గం స్వర్గం స్వర్గం'' అని మూడుసార్లు అన్నాడు.

(అయిపోయింది)